E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 24-01-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక: 24 || పేజీలు–6 www.ekaburu.com




ఫోన్‌పే ఐపీఓ: వాటాల అమ్మకానికి ముందుకు రాని షేర్‌హోల్డర్లు!

» 2లో

## ఖాజాగూడ లింకురోడ్డు 27

# కబ్జార్పణం

### రోడ్డుకు అడ్డంగా నిర్మాణాలు... చేష్టలుడిగిన అధికారులు...

### కొండను తవ్వి రోడ్డు – కొసను పూర్తి చేయక చేతులెత్తేసిన వైనం

### రూ.47.66కోట్లుబూడిదలో పోసిన పన్నీరేనా...?




**ఈ కబురు, శేరిలింగంపల్లి : ఖాజాగూడ లింకురోడ్డు 27 కబ్జాల పాలవుతుంది. కోట్లు వేచ్చించి ప్రారంభించిన ఈ రహదారి నిర్మాణం పూర్తి కాకముందే కనుమరుగయ్యే స్థితికి చేరింది. ఐటి కారిడార్ లోని గచ్చిబౌలి నుంచి ఔటర్ రింగు రోడ్డుకు అనుసంధానంగా చేపట్టిన ఈ కీలక రహదారిని ఆక్రమించిన అక్రమార్కులు దర్జాగా రోడ్డుకు అడ్డంగా భవన నిర్మాణాలు, వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డును వేసేందుకు కొండను రెండుగా చీల్చిన అధికారులు రహదారిని పూర్తి చేయకపోగా, రహదారికి అడ్డంగా నిర్మాణాలు వెలుస్తున్నా చేష్టలూడిగి చూస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా భవిష్యత్తులో ఈ దారి పూర్తవుతుందనే నమ్మకం సన్నగిల్లగా, కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి....**

ఐటి కారిడార్ పరిధిలోని ప్రధాన రహహదారుల మీద ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు గత ప్రభుత్వ హయాంలో హెచ్ఆర్డీసిఎల్ ఆధ్వర్యంలో లింకురోడ్ల నిర్మాణానికి నడంబిగించారు. ఇందులో భాగంగా శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖాజాగూడ పెద్ద చెరువును అనుకొని గచ్చిబౌలి నుంచి ఖాజాగూడ వరకు అధికారులు రహదారి నిర్మించారు. కాగా ఖాజాగూడ చెరువు రోడ్డు నుంచి ఉర్దూ యూనివర్సిటీ గోడకు సమాంతరంగా ఔటర్ రింగురోడ్డు నానక్ రాంగూడ సర్కిల్ వరకు రహదారి నిర్మాణం కోసం లింకురోడ్డు 27 పనులు ప్రారంభించారు. 2022లో నాటి ఐటి శాఖమంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఈ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఖాజాగూడ చెరువు రోడ్డును ఆనుకొని భారీ గుట్ట అడ్డంగా ఉండడం, నిర్మాణ వ్యయం భారీగా అవుతుండడంతో నాటి ప్రభుత్వం 2.20 కిలోమీటర్ల ఈ రహదారి నిర్మాణానికి 47.66కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. ప్రారంభంలో వేగంగా పనులు చేపట్టిన అధికారులు కొండను రెండుగా చీల్చి, మధ్యలో నుంచి రహదారి నిర్మాణం చేపట్టారు. దాదాపు కిలోమీటరు పొడవు రహదారిని నాలుగు లైన్లుగా నిర్మాణం చేపట్టారు. కాగా మధ్యలో ఉన్న జనచైతన్య లేఅవుట్ వద్ద రోడ్డు కోసం భూసేకరణ వివాదస్పదంగా మారింది. జనచైనత్య లేఅవుట్ లో ఉన్న ప్లాట్ల యజమానులు కోర్టుకు వెళ్లడంతో రహదారి నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో మధ్యలో వంద మీటర్ల రహదారిని వదిలిపెట్టి ఆ తరువాత రహదారి నిర్మాణం చేపట్టారు. కానీ ఔటర్ సర్కిల్ ముందున్న భూముల సేకరణ సైతం కోర్టుకు చేరడంతో రోడ్డు నిర్మాణం పూర్తి కాకుండా ఆగిపోయింది. దీంతో అదికారులు తాత్కాలికంగా పూర్తయిన రహదారిని ఓక్రిడ్జ్ స్కూల్ ముందు నుంచి ఉన్న రహదారి మీదకు మళ్లించారు. ప్రస్తుతం ఈ దారి మీదుగా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. కాగా ఈ దారి విస్తీర్ణం చిన్నగా ఉండడం, ఈ దారిలో ప్రయాణిస్తే ఖాజాగూడ గ్రామంలోకి వెళ్లవలసి వస్తుండడంతో వాహనదారుల ట్రాఫిక్ కష్టాలు తీరలేదు.

తరువాయి 2లో

## అవినీతి ఊబిలో కాంగ్రెస్ సర్కారు



- అక్రమాలను ప్రశ్నిస్తున్నందుకే సిట్‌ల పేరిట విచారణ
- ప్రజల దృష్టి మళ్లించేందుకు పోలీసు వ్యవస్థను వాడుకుంటున్న రేవంత్
- హీరోయిన్ల ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు ఆధారాలుంటే బయటపెట్టండి
- దీనిపై అధికారులను నిలదీస్తే.. నీళ్లు నమిలారు: కేటీఆర్

**ఈ-కబురు, హైదరాబాద్:** "కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి ఊబిలో పీకల్లోతుల్లో కూరుకుపోయింది. రాష్ట్ర ఆదాయం గణనీయంగా పడిపోయింది. ప్రజలకిచ్చిన 420 హామీల అమలు.. ముఖ్యమంత్రి, మంత్రుల అక్రమాల గురించి మేం ప్రశ్నిస్తున్నందుకే...

తరువాయి 2లో

## సింగరేణిలో భారీ కుంభకోణాలు

- సోలార్ పవర్, ఎక్స్‌ప్లోజింగ్‌లోనూ అక్రమాలు
- వీటన్నింటిపై కిషన్‌రెడ్డి విచారణ జరిపించాలి: హరీశ్‌రావు

ఈకబురు, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీప బంధువు కోసమే సింగరేణిలో భారీ కుంభకోణాలకు పాల్పడ్డారని భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ఆరోపించారు. సోలార్ పవర్, ఎక్స్‌ప్లోజింగ్, ప్రకాశం ఖని, శ్రీరాంపూర్ ఓబీల్లోనూ స్కాంలు జరిగాయన్నారు. ఈ వ్యవహారాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఫోన్ ట్యాపింగ్‌లో తనకు, కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారని విమర్శించారు. అన్ని అక్రమాలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి రాసిన లేఖను హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'




తరువాయి 2లో


## తనవల్లే 800 ఉరిశిక్షలు ఆగాయన్న ట్రంప్.. స్పందించిన ఇరాన్

» 2లో



## పాలే లేని.. పాపాల నెయ్యి

- అక్షరాలా 60 లక్షల కిలోల సరఫరా
- 201924 మధ్య దానితోనే 20 కోట్ల శ్రీవారి లడ్డూల తయారీ
- వైకాపా పాలనలో కుంభకోణం
- రూ. 235 కోట్లు దుర్వినియోగం
- డెయిరీలతో చేతులు కలిపిన తితిదే ఇంటిదొంగలు
- వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న డెయిరీల ప్రతినిధులతో బేరసారాలు
- హవాలా మార్గాల్లో లంచాల స్వీకరణ
- తేల్చిచెప్పిన సిట్
- 600 పేజీలతో తుది అభియోగపత్రం దాఖలు



తరువాయి 3లో



## 25 కాదు.. 10 శాతమే

- అదనపు బియ్యంలో నూకలపై కేంద్రం కొత్త షరతు
- ఖరీఫ్‌లో 53 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు అనుమతి.. రాష్ట్రం కొనుగోలు చేసింది 71.7 లక్షల టన్నులు
- మిగులు పంట సర్దుబాటుకు ప్రభుత్వం వరుస ప్రయత్నాలు
- కేంద్రం కొత్త ప్రతిపాదన ప్రకారం ఇచ్చేందుకు మంత్రి ఉత్తమ్ గ్రీన్‌సిగ్నల్

» 2లో

## అది ముస్లింలీగ్ మావోయిస్టు కాంగ్రెస్

- ప్రతిపక్షంపై ప్రధాని మోదీ ఆగ్రహం
- కేరళ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా




ఈకబురు, తిరువనంతపురం: విపక్ష కాంగ్రెస్ అధికారం కోసం సంఘ విద్రోహ శక్తులను ప్రోత్సహిస్తోందని, ముస్లిం లీగ్‌తో అంటకాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ముస్లింలీగ్ మావోయిస్టు కాంగ్రెస్(ఎంఎంసీ)గా మారిపోయిందని ఆరోపించారు. శుక్రవారం కేరళ రాజధాని తిరువనంతపురంలో భారీ బహిరంగ సభలో ప్రధానమంత్రి ప్రసంగించారు. కాంగ్రెస్ దుష్ట రాజకీయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. వారి దుర్మార్గ వ్యూహాలకు కేరళను ప్రయోగశాలగా వాడుకుంటున్నారని చెప్పారు.

కాంగ్రెస్‌కు అభివృద్ధి అజెండా లేదన్నా రు. మావోయిస్టులను మించిన కమ్యూనిస్టులుగా, ముస్లింలీగ్‌ను మించిన మతతత్వవాదులుగా మారిపోయారని కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. సీపీఎం నేతృత్వంలోని అధికార ఎల్డీఎఫ్ తీరుపై మండిపడ్డారు. శబరిమలలో అయ్యప్ప ఆలయ సంప్రదాయాలను ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. అయ్యప్ప బంగారాన్ని సైతం చోరీ చేశారని విమర్శించారు. కేరళలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే బంగారం చోరీపై సమగ్ర విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. దోషులను గుర్తించి జైలుకు పంపిస్తామన్నారు. ఇదీ మోదీ గ్యారంటీ అని స్పష్టంచేశారు. రాష్ట్రంలో వామపక్షాల నేతృత్వంలోని ఎల్డీఎఫ్, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఒక్కటేనని విమర్శించారు. అవినీతికి చరమగీతం పాడి అభివృద్ధికి బాటలు వేసే బీజేపీని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కేరళ ప్రజలకు పిలుపునిచ్చారు. మన నినాదం 'వికసిత్ కేరళం' అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. మార్పునకు ఇదే సరైన సమయమని వెల్లడించారు. గుజరాత్‌లో నాలుగు దశాబ్దాల క్రితం తొలుత అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పాగా వేసి, క్రమంగా రాష్ట్రమంతటా విస్తరించామని అధికారం దక్కించుకున్నామని మోదీ గుర్తుచేశారు.

తరువాయి 2లో

## నాటో సభ్య దేశాలను నమ్మలేం

- మాకు అవసరమైనప్పుడు అండగా నిలవరు
- అఫ్గాన్‌లో వారు వెనకే ఉన్నారు
- ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు
- తీవ్రంగా ఖండించిన బ్రిటన్



ఈకబురు, లండన్: తమ దేశానికి ఏదైనా ప్రమాదం వస్తే.. నాటో సభ్యదేశాలు అండగా నిలుస్తాయని తాను భావించడం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. "మాకు అవసరమైనప్పుడు వారు (నాటో దేశాలు) అండగా ఉంటారని నేను అనుకోవడం లేదు. అయినా వారి అవసరం మాకు లేదు. వారినెప్పుడూ మేం ఏదీ అడగలేదు. అఫ్గానిస్థాన్‌కు సేనలు పంపామని, ఇంకేదో చేశామని చెబుతారు. వారు ఎప్పుడూ యుద్ధరంగంలో ముందు లేరు. వెనకే ఉన్నారు" అని ట్రంప్ అన్నారు. ఈ వ్యాఖ్యలు దుమారం రేపాయి. నాటోలో అమెరికాతో పాటు బ్రిటన్, ఫ్రాన్స్ సహా పలు దేశాలు సభ్యులుగా ఉన్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై బ్రిటన్ ప్రధాని స్టార్మర్ తీవ్రంగా స్పందించారు. అఫ్గాన్ యుద్ధంలో కేవలం అమెరికా సేనలే ముందు ఉన్నాయని, మిగతా నాటో దేశాలు యుద్ధ క్షేత్రానికి దూరంగా ఉన్నాయని ట్రంప్ చెప్పడాన్ని తప్పుబట్టారు. దీనికి ట్రంప్ క్షమాపణ చెప్పాలని అభ్యర్థించారు. ఇది తమ సైనికులను అవమానించడమేనని అన్నారు.

తరువాయి 2లో

## నెట్ జీరో పారిశ్రామిక అభివృద్ధే లక్ష్యం

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- దావోస్‌లో 'నెక్స్‌ట్‌జెన్' మెటీరియల్స్ వృద్ధిపై కీలక సమావేశం
- కాలుష్య రహిత పారిశ్రామికీకరణకు 2 బిలియన్ డాలర్ల పెట్టుబడి సమీకరణపై చర్చ

తరువాయి 2లో



# అవినీతి ఊబిలో కాంగ్రెస్ సర్కారు

సిట్‌లతో విచారణ పేరిట మమ్మల్ని వేధిస్తున్నారు. వారి వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి సీఎం రేవంత్‌రెడ్డి పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు. ఎన్ని సిట్‌లు వేసినా, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటాం'' అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టంచేశారు. శుక్రవారం సిట్ విచారణకు వెళ్లడానికి ముందు, విచారణ అనంతరం ఆయన హరీశ్‌రావు ఇతర భారాస ముఖ్యనేతలతో కలిసి తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ''నన్ను సాక్షిగా పిలిచారా? మరేదైనా కారణంతోనా? అన్నది తెలియదు. కానీ సిట్ అధికారులు అడిగిందే అడుగుతున్నారు. ఒక 300 పేర్లు చదువుతూ.. ఈయన తెలుసా? ఆయన తెలుసా? అంటూ టైంపాస్ చేశారు. 'ఫోన్ ట్యాపింగ్ విచారణను రెండేళ్లుగా కొనసాగిస్తున్నారు. అవాస్తవ లీకులిస్తూ మా నాయకుల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. హీరోయిన్ల ఫోన్లు ట్యాపింగ్ జరిగినట్లు ఏమైనా ఆధారాలున్నాయా? ఉంటే బయటపెట్టండి. ఈ అవాస్తవ లీకులకు బాధ్యులెవరూ? వాటిని మీరు నిరోధించలేరా?' అని అధికారులను ప్రశ్నించా. వాస్తవమైతే మా ముందు పెట్టండనీ అడిగా. 'మాకు సంబంధం లేదు.. మాకేమీ తెలియదంటూ' అధికారులు నీళ్లు నమిలారు. విచారణ సమయంలో తారక రామారావు తప్ప... మరో రావు ఎవరూ లేరు. మీరు ఎన్ని కేసులైనా పెట్టండి. ఎన్ని సిట్‌లన్నా వేయండి. ఎన్నిసార్లు పిలిచినా వస్తామని అధికారులకు చెప్పా.

ముందు హామీల అమలుపై దృష్టిపెట్టండి

ఈరోజు రాష్ట్రంలో వ్యవసాయం మొదలు అన్ని రంగాల్లో వ్యవస్థలు కుప్పకూలాయి. మేం అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతల కుటుంబాలను ఏనాడూ రాజకీయాల్లోకి లాగలేదు. అక్రమ కేసులు పెట్టి వేధించలేదు. కానీ, గత ఐదారేళ్లుగా నాపై కాంగ్రెస్ పార్టీ తీవ్రమైన దుష్ప్రచారం చేసింది. డ్రగ్స్ కేసులో హీరోయిన్లతో సంబంధాలంటూ నన్ను అనేక అంశాల్లో ఇరికించాలని చూసింది. నా కుటుంబాన్ని, పిల్లలనూ మానసిక క్షోభకు గురిచేశారు. అయినా నేను ఎవరికీ భయపడలేదు. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ అంశంలోనూ ఎవరి కుట్రలకు భయపడేదే లేదు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని కచ్చితంగా ఎత్తిచూపుతాం. ఇవాళ సింగరేణి టెండర్లలో కుంభకోణం బయటపడింది. సీఎం, మంత్రుల మధ్య వాటాల పంచాయతీలో ఇది బహిర్గతమైంది. రూ.300 కోట్ల కోసం ఒక పారిశ్రామికవేత్త తలకు తుపాకీ పెట్టారని చెప్పి కేసు నమోదైతే.. దానిపై సిట్ ఎందుకు వేయలేదు? స్వయంగా ఒక మంత్రి కుమారుడు భూకబ్జాలు చేస్తూ గూండాలను తీసుకొని స్వైరవిహారం చేస్తుంటే... దానిపై సిట్ లేదు? హిల్ట్ పాలసీ పేరిట రూ.5 లక్షల కోట్ల ప్రజల ఆస్తిని కొల్లగొట్టడంపై ఎందుకు దర్యాప్తు చేయరు? ముఖ్యమంత్రి బావమరిదికి అర్హత లేకపోయినా... కేంద్ర ప్రభుత్వ పథకంలో టెండర్లు కట్టబెడుతున్నారని ఆధారాలతో సహా కేంద్రానికి ఇస్తే.. దానిపై ఎందుకు విచారణ జరిపించరు? న్యాయం, ధర్మం, ఖాకీ బుక్కు అందరికీ ఒకటే తీరు ఉండాలి కదా? ప్రభుత్వం ఈ కక్షసాధింపు వైఖరిని వీడి.. ముందుగా ఆరు గ్యారంటీల అమలుపై, పరిపాలనలోని వైఫల్యాలపై దృష్టి పెట్టాలి'' అని కేటీఆర్ సూచించారు.



# తనవల్లే 800 ఉరిశిక్షలు ఆగాయన్న ట్రంప్.. స్పందించిన ఇరాన్

ఈకబురు, తన వల్లే ఇరాన్‌లో 800లకు పైగా నిరసకారుల మరణ శిక్షలు ఆగాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ న్యాయవ్యవస్థకు చెందిన ప్రముఖ ప్రాసిక్యూటర్ (Irans top prosecutor) మొహమ్మద్ మొవాహెది స్పందించారు. అవన్నీ అబద్ధాలన్నారు. ఆ సంఖ్యలో మరణ శిక్షలు లేవన్నారు. న్యాయస్థానం కూడా ఇటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. దీనిపై తప్పుడు వార్తలు, ప్రకటనలను ప్రచారం చేయొద్దని అంతర్జాతీయ మీడియా వర్గాలకు సూచించారు. ట్రంప్ (Donald Trump) గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్‌లోని వందల మంది నిరసనకారులకు విధించిన ఉరిశిక్షలను అమెరికా ఒత్తిడి వల్ల అక్కడి అధికారులు రద్దు చేశారని పేర్కొన్నారు. తాను కల్పించుకోకపోయి ఉంటే 800 మందికి పైగా ప్రాణాలు కోల్పోయేవారని.. వారి ఉరిశిక్షలను తానే ఆపానని తెలిపారు. తీవ్ర చర్యలు తీసుకుంటానని హెచ్చరించడంతో ఇరాన్ పాలకవర్గం వెనక్కి తగ్గిందన్నారు.



# సింగరేణిలో భారీ కుంభకోణాలు




మొదటి పేజీ తరువాయి

'సింగరేణి టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికేషన్‌తో కుంభకోణం బయటపడింది. గతంలో యూపీఏ ప్రభుత్వాన్ని బొగ్గు కుంభకోణం ఎలా దెబ్బతీసిందో.. రేవంత్ ప్రభుత్వ పతనానికి కూడా ఈ కోల్ స్కాం బీజం వేసింది. సింగరేణిలో సోలార్ పవర్‌లోనూ కుంభకోణానికి తెరలేపారు. తమ అనుయాయులకు మూడు వేర్వేరు సైట్లలో సోలార్ పవర్ ప్లాంట్లను కట్టబెట్టడానికి.. మూడింటికి కలిపి 107 మెగావాట్లతో సింగిల్ టెండర్ పిలిచారు. ఇందులోనూ ఎంఎస్ఎంఈలు, పారిశ్రామికవేత్తలు పాల్గొనకుండా.. సైట్ విజిట్ సర్టిఫికెట్ కండిషన్ పెట్టారు. రామగుండంలో జరిగిన ఈ స్కాంలో.. తమకు అనుకూల సంస్థకు రూ.250 కోట్లు అదనంగా వచ్చేలా టెండర్‌ను అప్పగించారు. మరో 67 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌లోనూ ఇదే విధంగా మరో రూ.250 కోట్ల అక్రమాలకు తెగబడ్డారు.

ఒత్తిడి చేయడంతో డైరెక్టర్ రాజీనామా..

సింగరేణిలో జిలెటిన్ స్టిక్స్ కొనుగోలులో 30 శాతం రేటు అదనంగా పెట్టి కొనాలని ఒత్తిడి చేయడంతో.. ఒక డైరెక్టర్ రాజీనామా చేశారు. మరో డైరెక్టర్ కూడా దీనికి నిరాకరిస్తే.. ఆయన్ను జీఎం పదవికి రివర్స్ చేశారు. ఫీల్డ్ విజిట్ నిబంధనతోనే ప్రకాశం ఖనికీ రూ.1,044 కోట్లతో టెండర్‌ను పిలిచారు. మరి ఈ నిబంధన ఒక టెండర్‌లో తప్పు అయినప్పుడు.. ఇక్కడ కూడా తప్పే కదా? వెంటనే ప్రకాశం ఖని టెండర్‌ను కూడా రద్దు చేయాలి. శ్రీరాంపూర్ ఓబీల్లో రూ.600 కోట్ల పనులకు టెండర్ పిలిచారు. టెక్నికల్ బిడ్ ఓపెన్ చేసి.. ఫైనాన్షియల్ బిడ్ కోసం ఏడుసార్లు డేట్ ఇచ్చి వాయిదా వేశారు. సీఎం సమీప బంధువు కోసమే ఇలా వాయిదా వేశారు. ఈ అన్ని టెండర్లను రద్దు చేయాలి. కాంగ్రెస్, భాజపాల మధ్య చీకటి బంధం లేకపోతే.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విచారణకు ఆదేశించాలి'' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# అది ముస్లింలీగ్ మావోయిస్టు కాంగ్రెస్



అదే తరహాలో కేరళలోని తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌ను గెల్చుకున్నామని, ఇక రాష్ట్రంలో అధికారంలోకి రాబోతున్నామని ధీమా వ్యక్తంచేశారు. గుజరాత్ ఫలితం కేరళలో పునరావృతం అవుతుందన్నారు. తిరువ నంతపురం మేయర్‌గా ఎన్నికైన వి.వి.రాజేశ్‌ను బహిరంగ సభ వేదికపై ప్రధాని మోదీ అభినందించారు. ఆయనతో కలిసి చేతులు పైకెత్తి ప్రజలకు అభివాదం చేశారు. తిరువనంతపురం మున్సిపల్ కార్పొ రేషన్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం పట్ల మోదీ హర్షం వ్యక్తంచేశారు. డిప్యూటీ మేయర్ ఆశానాథ్.. మోదీ కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం అందుకున్నారు. ప్రధాని మోదీ కేరళలో పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు.

# 'సర్'తో పెరుగుతున్న ఆత్మహత్యలు: మమత

ఈ-కబురు,కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో నడుస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం వల్ల ఒత్తిడి భరించలేక రోజుకు ముగ్గురు నలుగురు ఓటర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. ఇంతవరకు మొత్తం 110 మంది మరణించారని.. ఆత్మహత్యాయత్నం చేసి ఆసుపత్రిపాలైన 40-45 మంది చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నారని మమత పేర్కొన్నారు. ఇంతవరకు 1.38 కోట్లమంది ఓటర్లను సర్ విచారణకు పిలిచారని.. ఇప్పటికే 58 లక్షల మంది పేర్లు తొలగించారని ఆమె వెల్లడించారు. నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి సందర్భంగా శుక్రవారం కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో మమతా ప్రసంగించారు. నేతాజీ ఇప్పుడు బతికి ఉంటే ఆయన పౌరసత్వాన్ని కూడా సందేహించేవారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

# 25 కాదు.. 10 శాతమే



ఈకబురు, : ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో రికార్డుస్థాయిలో ధాన్యం ఉత్పత్తి, కొనుగోలు నేపథ్యంలో మిగులు ధాన్యాన్ని ఎలా సర్దుబాటు చేయాలన్న అంశం సవాలుగా మారిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కొత్త షరతు విధించింది. 202526 ఖరీఫ్‌లో 53 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు అనుమతించగా, పౌరసరఫరాల సంస్థ ఇప్పటికే 71.70 లక్షల టన్నులు సేకరించింది. మిగులు ధాన్యం సేకరణకూ అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కేంద్రాన్ని కోరింది. సేకరించిన వడ్లను మరాడించాక వచ్చే బియ్యాన్ని భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)కి ఇస్తారు. కొనుగోలు చేసిన వడ్ల పరిమాణంలో 67 శాతం మొత్తాన్ని బియ్యం రూపంలో ఇవ్వాలి. అందులో 25శాతం వరకు నూకలు ఉండొచ్చు. అయితే మిగులు ధాన్యాన్ని అనుమతించే విషయంలో కేంద్రం మెలిక పెట్టింది. నూకలు 10 శాతానికి మించకుండా ఇవ్వాలని స్పష్టం చేసింది.

**బోనస్‌తో భారీగా అమ్మకం..**

సన్నాలకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో ఈసారి సాగుతోపాటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులు, వడ్ల పరిమాణం భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచాలని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖల మంత్రి ప్రహ్లాద్‌జోషీకి పలుమార్లు లేఖలు రాశారు. ఓసారి దిల్లీ వెళ్లి స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశారు. దేశంలో పలు రాష్ట్రాల్లో ఈసారి ధాన్యం ఉత్పత్తి పెరిగినందు వల్ల తొలుత కేటాయించిన కోటాను పెంచే అవకాశాల్లేవని ప్రహ్లాద్‌జోషి స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో ఉత్తమ్.. ప్రధాని మోదీకి ధాన్యం కోటా పెంపుపై లేఖ రాసేందుకు సిద్ధమయ్యారు. ఈ పరిణామాల క్రమంలో కేంద్రం నుంచి కొత్త ప్రతిపాదన(10శాతం నూకలు) రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు వచ్చింది. ఇదే విషయాన్ని ఉత్తమ్ దృష్టికి కమిషనర్ తీసుకెళ్లి చర్చించారు.

**ముందుకు వస్తున్న మిల్లర్లు..**

దాదాపు 18 లక్షల టన్నుల మిగులు ధాన్యాన్ని నిల్వచేయడానికి స్టోరేజీ సమస్యలు ఉండటం, మిల్లింగ్ చేశాక ఏ బియ్యాన్ని ఏం చేయాలన్న సవాళ్ల నేపథ్యంలో నూకశాతాన్ని తగ్గించి ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత చూపిస్తోంది. కేంద్రం కొత్త ప్రతిపాదన మేరకు 10 శాతం నూకలతో బియ్యం ఇస్తామని చెప్పేందుకు మంత్రి ఉత్తమ్ కమిషనర్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నూకలు 25 శాతం కాకుండా 10 శాతంతోనే ఇచ్చేందుకు కొందరు మిల్లర్లు ముందుకు వచ్చినట్లు సమాచారం. మిగతావారితోనూ మాట్లాడి ఒప్పించేందుకు పౌరసరఫరాలశాఖ ప్రయత్నించనున్నట్లు సమాచారం. అయితే తక్కువ నూకల శాతంతో బియ్యం ఇవ్వాలంటే ఆర్థికనష్టం ఉంటుందని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చేయాలని కొందరు మిల్లర్లు కోరుతున్నట్లు తెలుస్తోంది.

# నెట్ జీరో పారిశ్రామిక అభివృద్ధే లక్ష్యం

ఈకబురు, హైదరాబాద్: 'నెట్ జీరో' పారిశ్రామికాభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకెళుతోందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ప్రపంచ పారిశ్రామిక విధానాల్లో కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు సుమారు 2 బిలియన్ డాలర్ల పెట్టుబడి సమీకరణకు అనుసరించాల్సిన ప్రణాళికలపై దావోస్‌లో శుక్రవారం 'కెనోపీ' సంస్థ.. నం.17 ఫౌండేషన్, పావోచీ గ్రూప్‌లు సంయుక్తంగా నిర్వహించిన 'నెక్స్‌ట్‌జెన్' ఉన్నతస్థాయి చర్చావేదికలో వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు, పెట్టుబడిదారులు, పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ''తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌కు అనుగుణంగా నెక్స్‌ట్‌జెన్ ప్రణాళికలున్నాయి. అవసరమైన ఆవిష్కరణల సామర్థ్యం, పారిశ్రామిక విస్తరణకు అన్ని రకాల అనుకూలతలు తెలంగాణకు ఉన్నాయి. తెలంగాణలో వ్యవసాయ వ్యర్థాలు.. టెక్స్‌టైల్, పేపర్, ప్యాకేజింగ్ పరిశ్రమలకు అవసరమైన నెక్స్‌ట్‌జెన్ ఫైబర్‌గా మారనున్నాయి. వ్యర్థాలు విలువైన వనరుగా మారినప్పుడు.. నగరాలు స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటాయి. భవిష్యత్‌లో ఈ ప్రణాళికలో భాగస్వామ్యం కావడానికి మేము సిద్ధంగా ఉన్నాం. పరిశ్రమలు, పెట్టుబడిదారులు, ప్రపంచ మార్కెట్లను ఏకం చేసి.. స్థిరమైన మెటీరియల్స్ ఎకోసిస్టమ్‌ను నిర్మించేందుకు తెలంగాణ నాయకత్వం వహిస్తుంది. ఈ మార్పు కేవలం పర్యావరణానికే పరిమితం కాదు. తక్కువ కర్బన పదార్థాల ఉత్పత్తిలో భారత్ గ్లోబల్ బెంచ్‌మార్క్‌గా మారేందుకు ఇది అరుదైన అవకాశం. టెక్స్‌టైల్స్, ప్యాకేజింగ్ నుంచి డీప్‌టెక్ ఆవిష్కరణల వరకు హైదరాబాద్‌కు అన్ని రంగాల బలం ఉంది. ఆసియాలో ఇంతటి భారీ ప్రాజెక్టును వేగంగా అమలు చేయగలిగిన సత్తా ఉన్న కొన్ని నగరాల్లో హైదరాబాద్ ఒకటి'' అని వివరించారు. కెనోపీ సంస్థ వ్యవస్థాపకురాలు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నికోల్ రైక్రాఫ్ట్ మాట్లాడుతూ.. ''వ్యవసాయ వ్యర్థాలు, రీసైకిల్ చేసిన వస్త్రాల నుంచి అధిక విలువ కలిగిన ఫైబర్‌ను ఉత్పత్తి చేయడం.. తద్వారా కలప గుజ్జుపై ఆధారపడడాన్ని తగ్గించడం.. ఈ కొత్త బ్లూప్రింట్ ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం కేటాయించిన 2 బిలియన్ డాలర్ల పెట్టుబడితో.. భారత్‌లో 1.5మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకొల్పనున్నారు. ఇది 2033 నాటికి ప్రపంచవ్యాప్తంగా 78 బిలియన్ డాలర్లను సమీకరించే బృహత్తర ప్రయత్నంలో మొదటి దశ' అని తెలిపారు.



# నాటో సభ్య దేశాలను నమ్మలేం



అఫ్గాన్ పోరులో తమ సైనికులు ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు.

ట్రంప్ వ్యాఖ్యలపై బ్రిటన్ యువరాజు హ్యారీ కూడా స్పందించారు. అఫ్గానిస్థాన్‌లో బ్రిటిష్ సైనికుల త్యాగాలను నిజాయతీగా అంగీకరించాల్సిన, గౌరవప్రదంగా స్మరించుకోవాల్సిన సమయం ఇదని వ్యాఖ్యానించారు. ''నేను అఫ్గాన్‌లో సైనిక సేవలు అందించాను. ఎందరో జీవితకాల మిత్రులు అక్కడ నాకున్నారు. చాలా మంది స్నేహితులు ప్రాణాలు కోల్పోయారు. ఒక్క బ్రిటన్‌కు చెందిన వారే 457 మంది సైనికులు చనిపోయారు. మేము ఎల్లప్పుడూ రక్షణ విషయంలో దౌత్యం, శాంతికి కట్టుబడి ఉన్నాం'' అని హ్యారీ వివరించారు.

ఐక్యరాజ్యసమితి (ఐరాస)పై కూడా ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. తాను ఛైర్మన్‌గా ఉన్న గాజా శాంతి మండలితో కలిసి ఐరాస పనిచేస్తే ఆ సంస్థకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు.

కెనడాకు పంపిన ఆహ్వానం వెనక్కి

కెనడా ప్రధాని మార్క్ కార్నీ దావోస్ వేదికగా ట్రంప్ ప్రకటించిన 'గ్రీన్‌లాండ్' సుంకాలను తీవ్రంగా వ్యతిరేకించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గాజా శాంతి మండలిలో చేరాలని కెనడాకు పంపిన ఆహ్వానాన్ని ట్రంప్ వెనక్కి తీసుకున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో తన నిర్ణయాన్ని వెలువరించారు. ఇప్పటివరకు ఏర్పాటైన ప్రతిష్ఠాత్మక బోర్డులలో గాజా శాంతి మండలి కూడా ఒకటని తెలిపారు. దావోస్‌లో ఇటీవల నిర్వహించిన సమావేశంలో కార్నీ మాట్లాడుతూ.. అమెరికా ఆధిపత్యంలో ప్రపంచం పరివర్తన వైపు కాకుండా విచ్ఛిన్నం వైపు వెళ్తుందన్నారు.

శాంతిమండలిపై ఎలాన్‌మస్క్ వ్యంగ్యాస్త్రాలు

దావోస్ వేదికగా డొనాల్డ్ ట్రంప్ గాజా 'శాంతి మండలి'ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు ఇది శాంతి మండలి కాదు.. పీస్ (ముక్క) అంటూ విమర్శలు చేశారు. 'శాంతి మండలి ఏర్పాటు గురించి విన్నాను. అది పీస్(ముక్క) అని అనుకున్నా. గ్రీన్‌లాండ్, వెనెజువెలాల్లాగే అది ఒక చిన్న ముక్క' అని వ్యాఖ్యానించారు. దీంతో వేదిక వద్ద ఉన్నవారంతా ఒక్కసారిగా నవ్వులు చిందించారు.

నేరముఠాలకు అండగా నిలిస్తే ఖబడ్దార్

హైతీ దేశానికి ట్రంప్ యంత్రాంగం హెచ్చరిక

సాన్ జువాన్: వెనెజువెలా రాజధానిపై దాడి చేసి.. ఆ దేశ అధ్యక్షుడు మదురోను నిర్బంధించిన అమెరికా.. ఇప్పుడు కరీబియన్ దీవుల్లోని హైతీ దేశాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఆ దేశ పాలనను నిర్వహిస్తున్న మధ్యంతర అధ్యక్ష మండలిని తీవ్రంగా హెచ్చరిస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. మండలిలో కొందరు నేర ముఠాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆ ప్రకటనలో అమెరికా ఆరోపించింది. ముఖ్యంగా ప్రధాని అలెక్స్ దిదియర్‌ను తప్పించేందుకు తాత్కాలిక మండలి చేస్తున్న ప్రయత్నాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీని వల్ల దేశంలో రాజకీయ అస్థిరత నెలకొనే ప్రమాదం ఉందని పేర్కొంది. మండలిలో నేతలు తమ ధోరణి మార్చుకోవాలని లేకపోతే తాము జోక్యం చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. 2024 ఏప్రిల్ నుంచి దేశాన్ని పాలిస్తున్న తాత్కాలిక అధ్యక్ష మండలి త్వరలో దేశంలో ఎన్నికలు నిర్వహించడానికి కసరత్తు చేస్తోంది. అయితే ఈ మండలి తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలపై ట్రంప్ యంత్రాంగం అసంతృప్తిగా ఉంది.

# మంత్రి సీతక్క జనగామ పర్యటనలో ఉద్రిక్తత

ఈకబురు, జనగామ, : జనగామలో మంత్రి సీతక్క పర్యటనలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్రొటోకాల్ విషయమై కాంగ్రెస్, భారాస శ్రేణుల మధ్య తోపులాటకు దారితీసింది. జనగామ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క శుక్రవారం శ్రీకారంచుట్టారు. ప్రొటోకాల్‌ను అనుసరించి స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. పెంబర్తి బైపాస్ రోడ్డు కూడలిలో సర్వాయి పాపన్న, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ విగ్రహాల ఆవిష్కరణ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే కొబ్బరికాయలు కొట్టారు. ఈ సమయంలో ఎమ్మెల్యే పల్లా.. భారాస మాజీ కౌన్సిలర్ ఒకరిని కార్యక్రమానికి ఆహ్వానించడంపై కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తనయుడు ప్రశాంత్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై మాటామాట పెరిగి.. రెండు పార్టీల నాయకుల మధ్య తోపులాటకు దారి తీసింది. పోలీసులు వారిని నిలువరించి కార్యక్రమాన్ని పూర్తి చేయించారు. ఆ తర్వాత జరిగిన వివిధ కార్యక్రమాల్లో మళ్లీ ఇరువర్గాలు తోపులాటకు దిగాయి. 'జనగామ చైతన్యం ఇదేనా.. ఎక్కడా ఇలాంటిది చూడలేదు' అని మంత్రి సీతక్క అసహనం వ్యక్తం చేశారు. అప్పటికే సమయం మించిపోవడంతో బచ్చన్నపేట మండల కేంద్రంలో రెండు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి మంత్రి హాజరుకాకపోవడంతో అవి రద్దయ్యాయి.



# ఖాజాగూడ లింకురోడ్డు 27 కబ్జార్పణం



శంకుస్థాపనకు గుర్తుగా మిగిలిపోయిన శిలాఫలకం



ఖాజాగూడ రహదారిని ఆక్రమించి వెలిసిన నిర్మాణాలు



లింకు రోడ్డు 27కు అడ్డంగా ప్రారంభమైన వ్యాపార సముదాయం



కొండను తవ్వి మధ్యలో నుంచి ఏర్పాటు చేసిన రహదారి

మొదటి పేజి తరువాయి

ఐటి కారిడార్ పరిధిలోని ప్రధాన రహదారుల మీద ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు గత ప్రభుత్వ హయాంలో హెచ్ఆర్డీసిఎల్ ఆధ్వర్యంలో లింకురోడ్ల నిర్మాణానికి నడంబిగించారు. ఇందులో భాగంగా శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖాజాగూడ పెద్ద చెరువును అనుకొని గచ్చిబౌలి నుంచి ఖాజాగూడ వరకు అధికారులు రహదారి నిర్మించారు. కాగా ఖాజాగూడ చెరువు రోడ్డు నుంచి ఉర్దూ యూనివర్సిటీ గోడకు సమాంతరంగా ఔటర్ రింగురోడ్డు నానక్ రాంగూడ సర్కిల్ వరకు రహదారి నిర్మాణం కోసం లింకురోడ్డు 27 పనులు ప్రారంభించారు. 2022లో నాటి ఐటి శాఖమంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఈ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఖాజాగూడ చెరువు రోడ్డును ఆనుకొని భారీ గుట్ట అడ్డంగా ఉండడం, నిర్మాణ వ్యయం భారీగా అవుతుండడంతో నాటి ప్రభుత్వం 2.20 కిలోమీటర్ల ఈ రహదారి నిర్మాణానికి 47.66కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. ప్రారంభంలో వేగంగా పనులు చేపట్టిన అధికారులు కొండను రెండుగా చీల్చి, మధ్యలో నుంచి రహదారి నిర్మాణం చేపట్టారు. దాదాపు కిలోమీటరు పొడవు రహదారిని నాలుగు లైన్లుగా నిర్మాణం చేపట్టారు. కాగా మధ్యలో ఉన్న జనచైతన్య లేఅవుట్ వద్ద రోడ్డు కోసం భూసేకరణ వివాదస్పదంగా మారింది. జనచైనత్య లేఅవుట్ లో ఉన్న ప్లాట్ల యజమానులు కోర్టుకు వెళ్లడంతో రహదారి నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో మధ్యలో వంద మీటర్ల రహదారిని వదిలిపెట్టి ఆ తరువాత రహదారి నిర్మాణం చేపట్టారు. కానీ ఔటర్ సర్కిల్ ముందున్న భూముల సేకరణ సైతం కోర్టుకు చేరడంతో రోడ్డు నిర్మాణం పూర్తి కాకుండా ఆగిపోయింది. దీంతో అధికారులు తాత్కాలికంగా పూర్తయిన రహదారిని ఓక్రిడ్జ్ స్కూల్ ముందు నుంచి ఉన్న రహదారి మీదకు మళ్లించారు. ప్రస్తుతం ఈ దారి మీదుగా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. కాగా ఈ దారి విస్తీర్ణం చిన్నగా ఉండడం, ఈ దారిలో ప్రయాణిస్తే ఖాజాగూడ గ్రామంలోకి వెళ్లవలసి వస్తుండడంతో వాహనదారుల ట్రాఫిక్ కష్టాలు తీరలేదు.

**కీలక రహదారి కబ్జాల పాలు...**

గచ్చిబౌలి ప్రధాన రహదారి నుంచి నానక్ రాంగూడ ఔటర్ రింగురోడ్డు సర్కిల్, ఐటి కారిడార్ ను కలిపే ఖాజాగూడ రహదారి మీద ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు అధికారులు లింకురోడ్డు 27 నిర్మాణం చేపట్టారు. ఈ రోడ్డు పూర్తియితే ఐటీ కారిడార్ నుంచి గచ్చిబౌలి వైపు ప్రయాణించే ఉద్యోగులు, ప్రయాణికులకు ట్రాఫిక్ నుంచి ఎంతో ఊరట లభించేది. కానీ కోర్టు వివాదాలతో రహదారి మధ్యలోనే నిలిచిపోగా, కోట్లు వెచ్చించి ప్రారంభించిన రహదారి నిర్మాణ పనులను పట్టించుకోకుండా వదిలేశారు. కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో యథాతథ స్థితి కొనసాగించాల్సి ఉండగా, ప్లాట్ల యజమానులు రోడ్డుకు అడ్డంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ఏకంగా లింకురోడ్డుకు అడ్డంగా షెడ్ల నిర్మాణం చేపట్టి, వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా భవిష్యత్తులో కోర్టు వివాదాలు పరిష్కారమైనా రోడ్డు నిర్మాణం చేపట్టే అవకాశం లేకుండా పోతుంది. జనచైతన్య లేఅవుట్ లో ఎటువంటి నిర్మాణాలకు అనుమతి లేకపోగా, ఏకంగా రోడ్డుకు అడ్డంగా అనుమతి లేని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తుంది. అధికారుల అండతోనే అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# పాలే లేని.. పాపాల నెయ్యి



ఈకబురు, అమరావతి, తిరుపతి; తిరుపతి (నేర విభాగం): వైకాపా హయాంలో 2019 24 మధ్య తిరుమల తిరుపతి దేవస్థానానికి అసలు నెయ్యే కాని దాన్ని నెయ్యి పేరిట సరఫరా చేశారని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ నిగ్గు తేల్చింది. పాలే లేకుండా పామాయిల్, పామ్ కర్నెల్ ఆయిల్‌తో సిద్ధం చేసిన పదార్థాన్నే నెయ్యి ముసుగులో సరఫరా చేశారని పేర్కొంది. దానికి నెయ్యి సువాసనలు వచ్చేలా చేసేందుకు బీటాకెరోటిన్ లాంటి రసాయనాలను కలిపారని తేల్చింది. ఇలా ఐదేళ్ల వ్యవధిలో ఏకంగా 60 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని వెల్లడించింది. దీంతోనే 20.01 కోట్ల శ్రీవారి లడ్డూలు, ఇతర ప్రసాదాలు తయారుచేశారని తెలిపింది. ఈ కుంభకోణంలో రూ.235 కోట్ల తితిదే నిధుల దుర్వినియోగానికి పాల్పడటమే కాకుండా, కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారని వివరించింది. కొంతమంది తితిదే ఉద్యోగులు, అధికారులు, డెయిరీ సంస్థల ప్రతినిధులతో కుమ్మక్కై ఈ కల్తీ నెయ్యి సరఫరాలో భాగస్వాములయ్యారని పేర్కొంది. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో సిట్ అధికారులు నెల్లూరు ఏసీబీ కోర్టులో శుక్రవారం తుది అభియోగపత్రం (ఛార్జ్‌షీట్) దాఖలు చేశారు. 600 పేజీలకు పైగా ఉన్న ఈ అభియోగపత్రంలో 36 మంది నిందితుల ప్రమేయాన్ని స్పష్టంగా వివరించారు. ఈ జాబితాలో తితిదే ఉద్యోగులు, అధికారులతో పాటు పలువురు డెయిరీ సంస్థల ప్రతినిధులున్నారు.

**కిలోకు రూ.25 చొప్పున లంచం డిమాండ్**

తితిదే అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ కె.చిన్న అప్పన్న డెయిరీ సంస్థల ప్రతినిధులతో బేరసారాలు జరిపి, హవాలా మార్గాల్లో లంచాలు తీసుకున్నారంటూ ఆ లావాదేవీల్ని సిట్ అభియోగపత్రంలో పొందుపరిచినట్లు సమాచారం. చిన్న అప్పన్న బ్యాంకు ఖాతాల్లో 2019 నుంచి 2024 మధ్య ఐదేళ్లలో రూ.4.69 కోట్లు జమ కాగా అందులో రూ.4.64 కోట్లు వివిధ ఖాతాలకు మళ్లించారు. కల్తీ నెయ్యి సరఫరా చేసిన సంస్థల నుంచి చిన్న అప్పన్న కిలోకు రూ.25 చొప్పున లంచం డిమాండ్ చేసి అందుకున్నట్లు అభియోగాలున్నాయి. సిట్ ఈ వివరాలన్నీ అభియోగపత్రంలో పేర్కొన్నట్లు తెలిసింది. ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీ, భోలేబాబా తదితర సంస్థలతో పాటు వాటి ప్రతినిధులు కల్తీ నెయ్యి సరఫరాలో ఎలా భాగస్వాములయ్యారో సిట్ ఛార్జ్‌షీట్‌లో అభియోగపత్రంలో వివరించింది.

**టెండర్ల నిబంధనల సడలింపుతో కల్తీకి రాచబాట**

తిరుమలకు నెయ్యి సరఫరా చేసే టెండర్లలో పాల్గొనేందుకు కఠిన నిబంధనలు ఉండేవి. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిబంధనల్ని పూర్తిగా సడలించేశారు. టెండర్లలో పాల్గొనే డెయిరీ పాలు సేకరించాల్సిన పనిలేదని, వెన్న సేకరణ, నెయ్యి ఉత్పత్తి సామర్థ్యంతో సంబంధం లేదని, డెయిరీ మూడేళ్ల కార్యకలాపాలు చేయక్కర్లేదని, ఏడాది చాలని, రూ.250 కోట్ల టర్నోవర్ అవసరం లేదని, రూ.150 కోట్లు ఉంటే చాలని నిబంధనలు మార్చేసింది. వైవీ సుబ్బారెడ్డి తితిదే పాలకమండలి ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఇదంతా జరిగింది. ఈ నిబంధనల సడలింపు వల్లే కల్తీ నెయ్యి సరఫరా సంస్థలకు అవకాశమిచ్చినట్లయ్యిందని సిట్ అభియోగపత్రంలో పొందుపరిచినట్లు తెలిసింది.

**సుబ్బారెడ్డి, భూమన, చెవిరెడ్డిల విచారణ**

ఈ కేసు దర్యాప్తులో భాగంగా అప్పటి తితిదే ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డిలతో పాటు తితిదే అప్పటి ఈవో ధర్మారెడ్డిని సిట్ అధికారులు విచారించారు. తితిదే పాలకమండలిలో ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, అప్పట్లో కొనుగోలు కమిటీలో సభ్యులుగా ఉన్న ప్రస్తుత మంత్రి కొలుసు పార్థసారథి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలనూ ప్రశ్నించారు. ఆ విచారణ అంశాలనూ అభియోగపత్రంలో పొందుపరిచినట్లు తెలిసింది.

**14 నెలల పాటు 12 రాష్ట్రాల్లో దర్యాప్తు**

సిట్ అధికారులు మొత్తం 14 నెలలపాటు ఈ కేసు దర్యాప్తు చేశారు. 12 రాష్ట్రాల్లో సోదాలు చేశారు. గతేడాది మే నెలలో తొలి ఛార్జ్‌షీట్ దాఖలు చేసినప్పుడు 24 మందిని నిందితులుగా చేర్చారు. నవంబరు 23న కోర్టుకు సమర్పించిన మెమోలో తితిదే ఉద్యోగులు, డెయిరీ నిపుణులు కలిపి మరో 12 మందిని నిందితులుగా పేర్కొన్నారు. ఈ 36 మంది నిందితుల ప్రమేయంపైనా తాజా అభియోగపత్రంలో స్పష్టంగా వివరించారు.

తమిళనాడు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ నుంచి దర్యాప్తు మొదలైంది. ఆ తర్వాత ఈ వ్యవహారంలో కీలక సూత్రధారులుగా భోలేబాబా ఓర్గానిక్ డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్ ఉన్నారని తేలింది. వీరు దిల్లీ, హరియాణా, రాజస్థాన్‌ల నుంచి రసాయనాలు తెప్పించి, ఉత్తరాఖండ్‌లోనే కల్తీ నెయ్యి తయారుచేసి పంపారని విచారణలో వెల్లడైంది. అనంతరం మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో నిందితులను గుర్తించారు.

ఈ కేసులో తొలుత గతేడాది ఫిబ్రవరి 9న ఏఆర్ డెయిరీ ఎండీ రాజురాజశేఖరన్, పొమిల్ జైన్, విపిన్ జైన్, అపూర్వ వినయ్‌కాంత్ చావ్డాలను.. అనంతరం అజయ్‌కుమార్ సుగంధ్, ఆశిష్ అగర్వాల్, హరిమోహన్‌రాణాలను అరెస్ట్ చేశారు. కల్తీ నెయ్యి సరఫరా చేసిన ఏఆర్, వైష్ణవి, మాల్‌గంగ, భోలేబాబా డెయిరీలకు రూ.251 కోట్లు తితిదే సొమ్మును చెల్లించారు. ఈ వివరాలన్నీ అభియోగపత్రంలో పొందుపరిచినట్లు సమాచారం.

# అన్ని రంగాల్లో ఆదర్శంగా గచ్చిబౌలి డివిజన్ : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



డ్రైనేజీ పైప్ లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**రాయదుర్గంలో భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ పనుల పరిశీలన**

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలి డివిజన్ ను అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, గత ఐదేళ్లుగా కోట్లాది రూపాయల నిధులను డివిజన్ అభివృద్ధికి వెచ్చించామని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి అన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గంలో నూతనంగా చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను స్థానిక నేతలతో కలిసి శుక్రవారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఒక ప్రణాళిక ప్రకారం దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రాయదుర్గం గ్రామంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నామని అన్నారు. వర్షాలు కురిసినప్పుడు వరద నీరు నిలువకుండా, కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేస్తామన్నారు. నూతనంగా చేపడుతున్న పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కంట్రాక్టర్ ను ఆదేశించారు. అభివృద్ధి పనులు ప్రజలకు ఎక్కువ కాలం అందుబాటులో ఉండేలా చేపట్టాలని సూచించారు. డ్రైనేజీ పైప్ లైన్ వేసిన వెంటనే ధ్వంసమైన రోడ్డు నిర్మాణం సైతం చేపట్టాలని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజలకు మేలైన మౌలిక వసతుల కల్పనకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని తెలిపారు. కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా సహాయ సహకారాలు ఉంటాయని కాలనీ వాసులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నరేందర్ ముదిరాజ్, సురేష్, దయాకర్, శ్రీశైలం, బ్రహ్మయ్య, దుర్గారామ్, శేఖర్, సుమన్, ప్రకాశ్, ఇందిరాతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులపై స్థానికులతో చర్చిస్తున్న దృశ్యం

# ఇరాన్ దిశగా అమెరికా సేనలు



దుబాయ్: అమెరికాఇరాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. భారీస్థాయిలో అమెరికా సైన్యం ఇరాన్ దిశగా కదులుతోంది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా వెల్లడించారు. ‘‘ఇరాన్‌ను నిశితంగా గమనిస్తున్నాం. భారీ సంఖ్యలో మా యుద్ధనౌకలు ఆ దేశం వైపు కదులుతున్నాయి. ఏమీ జరగకూడదనే అనుకుంటున్నా. వాటిని మేం ఉపయోగించకపోవచ్చు. ఏం జరుగుతోందో చూద్దాం’’ అని దావోస్ నుంచి అమెరికా వెళూతూ ‘ఎయిర్‌ఫోర్స్ వన్’ విమానంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మోహరింపుపై టెహ్రాన్ ఘాటుగా స్పందించింది. తమ వేలు ట్రిగ్గర్‌పైనే ఉందని పేర్కొంది. ఇరాన్‌లో కొంతకాలంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చెలరేగిన ఘర్షణల్లో 5,002 మంది మరణించారు. ఆందోళనకారులకు మద్దతుగా ట్రంప్ నిలిచారు. వారికి హాని కలిగిస్తే అమెరికా రంగంలోకి దిగుతుందని పలుమార్లు హెచ్చరించారు. అయితే ఆందోళనకారులకు మరణశిక్ష విధించబోమని ఇరాన్ నుంచి హామీ లభించిందని, ఆ దేశంపై సైనిక చర్య తీసుకోబోమని గత వారం ట్రంప్ పేర్కొన్నారు. దీంతో యుద్ధం తప్పిందని అంతా భావించారు. ఇప్పుడు అమెరికా యుద్ధనౌకలు, ఫైటర్ జెట్లు, క్షిపణి వ్యవస్థలు, గగనతల రక్షణ వ్యవస్థలు ఇరాన్ వైపు కదులుతుండటంతో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. పశ్చిమాసియాలోని తమ సైనిక స్థావరాల రక్షణకే ఈ సేనలను మోహరిస్తున్నామని అమెరికా అధికారి ఒకరు వివరణ ఇచ్చారు. యుద్ధ విమానాలతో కూడిన యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌక, పలు గైడెడ్ మిస్సైల్ డెస్ట్రాయర్లు త్వరలోనే పశ్చిమాసియా ప్రాంతానికి చేరుకుంటాయని పేర్కొన్నారు.

## బంగారం మరింత పైకి.. ఒక్క రోజులో రూ.5 వేలు జంప్



తగ్గినట్లే తగ్గిన బంగారం ధర మళ్లీ పెరిగింది. గ్రీన్‌లాండ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వరం మారిన వేళ తగ్గుముఖం పట్టిన పసిడి ధర మళ్లీ పైకెగిసింది. డెన్మార్క్ అధీనంలోని ద్వీపాన్ని బలప్రయోగం ద్వారా స్వాధీనం చేసుకోబోమని ట్రంప్ ప్రకటించడంతో.. నిన్న బంగారంలో లాభాల స్వీకరణ కనిపించింది. అయితే, అది ఒక్క రోజుకే పరిమితమైంది. ఇరాన్ చుట్టూ అమెరికా బలగాలు మోహరించడంతో మరోసారి అంతర్జాతీయంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించి మదుపర్లు బంగారం వైపు పెట్టుబడులను మళ్లిస్తున్నారు. బంగారానికి పెరిగిన డిమాండ్ కారణంగా మళ్లీ దీని ధర పెరిగింది. అంతర్జాతీయ విపణిలో బంగారం ధర ఔన్సు 5 వేల డాలర్లకు చేరువైంది. ప్రస్తుతం 4,945 డాలర్ల వద్ద కొనసాగుతోంది. దీన్ని అనుసరించి దేశీయంగా బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి పసిడి రూ.1,59,954 పలుకుతోంది. గురువారంతో పోలిస్తే ఒక్క రోజులోనే పసిడి రూ.5వేలు పెరిగింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1.41 లక్షలుగా ఉంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి ఔన్సు 98 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.3.25 లక్షలుగా ఉందని బులియన్ వర్గాలు పేర్కొంటున్నాయి.

## అదిరిపోయే ఫీచర్లతో మోటో సిగ్నేచర్ వచ్చేసింది.. ధర, ఫీచర్లు ఇవే!




ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ మోటోరొలా (Motorola) నుంచి కొత్త స్మార్ట్‌ఫోన్ విడుదలైంది. సిగ్నేచర్ సిరీస్‌లో కొత్త మొబైల్‌ను మోటో లాంచ్ చేసింది. ఈ ఫోన్ ప్రకటించినప్పటి నుంచి ఎప్పుడెప్పుడు తీసుకొస్తారా? అన్న ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో మార్కెట్‌లోకి అడుగుపెట్టింది. మరి ఈ స్మార్ట్‌ఫోన్ ధర, ఫీచర్లు, ఇతర వివరాలు ఏంటో చూద్దాం. మోటోరొలా సిగ్నేచర్ ఆండ్రాయిడ్ 16తో కూడిన మోటోరొలా హెలోయూఐతో వస్తోంది. ఇందులో 6.8 అంగుళాల సూపర్ హెచ్‌డీ ఎల్‌టీపీఓ ఎక్స్‌ట్రీమ్ అమోలెడ్ డిస్‌ప్లే అమర్చారు. 165Hz రిఫ్రెష్‌రేటు, 6200 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్, డాల్బీ విజన్, హెచ్‌డీఆర్ 10+ సపోర్ట్‌తో వస్తోంది. ఇందులో ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 8 జన్5 ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. ఐపీ68, ఐపీ 69 రేటింగ్‌తో కూడిన డస్ట్, వాటర్ రెసిస్టెన్స్ ఉంది. మిలటరీ గ్రేడ్ సర్టిఫికేషన్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్ 2 ప్రొటెక్షన్‌తో వస్తోంది. అల్యూమినియం ఫ్రేమ్ ఉంది. ఈ ఫోన్‌లో వెనక వైపు ట్రిపుల్ కెమెరా ఇచ్చారు. మూడూ 50 ఎంపీ కెమెరాలు ఉన్నాయి. ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌తో కూడిన 50 ఎంపీ ప్రైమరీ కెమెరాతో పాటు 50 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్, 50 ఎంపీ పెరిస్కోప్ సెన్సర్ ఇచ్చారు. 3 ఎక్స్ ఆప్టికల్ జూమ్, 100 ఎక్స్ హైబ్రిడ్ జూమ్‌కు సపోర్ట్ చేస్తుంది. ముందువైపు 50 ఎంపీ కెమెరా ఉంది. ఈ ఫోన్‌తో 8కె/30FPSతో వీడియోలు రికార్డు చేయొచ్చు. ఈ స్మార్ట్‌ఫోన్‌లో 5,200 ఎంఏహెచ్ సిలికాన్ కార్బన్ బ్యాటరీ ఉంది. ఇది 90W ఫాస్ట్‌ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. 50W వైర్‌లెస్ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం కూడా ఉంది. 41 గంటల బ్యాటరీ లైఫ్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. 5జీ, వైఫై 7, బ్లూటూత్ 6.0, యూఎస్‌బీ టైప్‌సి పోర్ట్ వంటివి ఉన్నాయి.

**ఇక ఫోన్ ధర విషయానికొస్తే..** ఈ ఫోన్ మొత్తం మూడు వేరియంట్లలో లభిస్తుంది. 12జీబీ+256జీబీ వేరియంట్ ధరను రూ.59,999గా కంపెనీ నిర్ణయించింది. 16జీబీ+ 512జీబీ వేరియంట్ ధర రూ.64,999గానూ, 16జీబీ+ 1టీబీ వేరియంట్ రూ.69,999గా పేర్కొంది. హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్ కార్డులతో కొనుగోళ్లపై రూ.5వేలు డిస్కౌంట్ పొందొచ్చు. లేదా ఎక్స్ఛేంజీ బోనస్ రూ.5 వేలు లభిస్తుంది. జనవరి 30 నుంచి ఫ్లిప్‌కార్ట్ వేదికగా విక్రయాలు మొదలవుతాయి.

## రిఫండ్ ఇంకా రాలేదా?




గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి (202425)ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసి, రిఫండు కోసం చాలామంది ఎదురుచూస్తున్నారు. వాస్తవానికి డిసెంబరు నాటికే దాదాపు రిఫండు ప్రక్రియ పూర్తవుతుంది. కానీ, ఈసారి సాంకేతిక కారణాలు, ఐటీ రిటర్నులు దాఖలు చేసిన వారి నుంచి మరింత స్పష్టమైన సమాచారాన్ని కోరడం తదితర కారణాలతో పన్ను చెల్లింపుదారులు ఇప్పటికీ నిరీక్షించాల్సి వస్తోంది. సాధారణంగా రిటర్నులలో ఏదైనా వ్యత్యాసం ఉన్నప్పుడు ఆదాయపు పన్ను శాఖ నోటీసుల ద్వారా పన్ను చెల్లింపుదారులకు సమాచారం అందిస్తుంది. ఒకసారి సమస్య పరిష్కారం అయిన తర్వాత రిఫండు విడుదల అవుతుంది. ఎలాంటి వ్యత్యాసాలు లేని సందర్భాల్లో వేగంగా రిఫండు బ్యాంకు ఖాతాలో జమవుతుంది. ఐటీఆర్ ఫారం 26 ఏఎస్/ఏఐఎస్‌తో పోల్చి చూసినప్పుడు మీరు దాఖలు చేసిన ఐటీఆర్‌లోని వివరాలు సరిపోలనప్పుడు.. బ్యాంకు ఖాతా వివరాలు తప్పుగా ఇవ్వడం లేదా ఖాతాను ముందస్తుగా ధ్రువీకరించుకోకపోవడం.. అనర్హమైన, తప్పుడు మినహాయింపులను క్లెయిం చేయడం.. ఐటీఆర్ ఫైల్ చేసిన తర్వాత రిటర్నులను తప్పనిసరిగా ఇవెరిఫికేషన్ చేయాలి. లేకపోతే రిఫండు రాదు. అధిక విలువ కలిగిన లావాదేవీలు కనిపించినప్పుడు, వాటిని రిటర్నులలో నమోదు చేయకపోవడం.. ఇలాంటి కొన్ని కారణాలతో రిఫండు రావడం ఆలస్యం కావొచ్చు. పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి నోటీసులు రాకపోతే, తక్షణమే ఏమీ చేయాల్సిన అవసరం లేదు. అంతర్గత తనిఖీలు, ధ్రువీకరణ పూర్తి కాగానే రిఫండు జమ అవుతుంది. పైన పేర్కొన్న కారణాల్లో ఏమైనా మీకు వర్తిస్తాయో పరిశీలించండి. ఒకవేళ మళ్లీ రిటర్నులు దాఖలు చేయాల్సి వస్తే.. అప్‌డేటెడ్ రిటర్నులను సమర్పించాలి.

### బేర్ రిటర్న్స్ ...

# భారీ నష్టాలతో ముగిసిన సూచీలు

## ₹6 లక్షల కోట్లు ఆవిరి



అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులు, నిరుత్సాహకర త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో దేశీయ స్టాక్ సూచీలు మరోసారి భారీ నష్టాలు చవిచూశాయి. విదేశీ మదుపర్ల అమ్మకాలూ ప్రభావం చూపాయి. దీంతో ఉదయం లాభాల్లో కదలాడిన సూచీలు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్ల మేర పతనం కాగా.. నిఫ్టీ 25,050 దిగువ స్థాయికి చేరుకుంది. దీంతో నిన్నటి లాభాల సంబరం ఒక్కరోజుకే పరిమితమైంది. మదుపర్ల సంపద రూ.6 లక్షల కోట్ల మేర ఆవిరైంది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.452 కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 82,335.94 (క్రితం ముగింపు 82,307.37) వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. మధ్యాహ్నం తర్వాత క్రమంగా నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 81,471.82 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 769.67 పాయింట్ల నష్టంతో 81,537.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 241.25 పాయింట్ల నష్టంతో 25,048.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 91.93 వద్ద మరోసారి ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఎటెర్నల్, ఇండిగో, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, టీసీఎస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 64.79 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4926 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**కారణాలు ఇవీ....** మార్కెట్ పతనానికి అతిపెద్ద కారణం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (FIIs) వరుసగా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండడం. వరుసగా 13వ రోజైన గురువారం 2,550 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించారు. జనవరిలో ఇప్పటివరకు వారు దాదాపు రూ.36,591 కోట్ల విలువైన షేర్లను అమ్మేశారు. ఇది ప్రభావం చూపింది. లంచం ఆరోపణల కేసులో అదానీ గ్రూప్ ప్రమోటర్లకు సమన్లు పంపేందుకు అమెరికాకు చెందిన సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (SEC) కోర్టు అనుమతి కోరినట్లు వార్తలు వచ్చాయి. దీంతో అదానీ గ్రూప్ షేర్లు (అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్ వంటివి) 13 శాతం వరకు నష్టపోయాయి. ఇది మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఇంట్రాడేలో జీవనకాల కనిష్ఠ స్థాయి అయిన 91.99కి పడిపోయింది. కరెన్సీ బలహీనపడటం విదేశీ ఇన్వెస్టర్లను మరింతగా అమ్మకాల వైపు నడిపిస్తోంది.మరోవైపు అమెరికాయూరప్ మధ్య వాణిజ్య సుంకాల విషయంలో ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతుండటం ఇన్వెస్టర్లలో ఆందోళన రేకెత్తిస్తోంది. దీనికితోడు సిప్లా, ఇండిగో వంటి దిగ్గజ కంపెనీల త్రైమాసిక ఫలితాలు నిరాశ పరిచాయి. సిప్లా లాభాలు 57% క్షీణించడంతో ఆ కంపెనీ షేర్లు 5 శాతం మేర క్షీణించాయి. ఇండిగో లాభాల్లో 78 శాతం క్షీణత నమోదు కావడంతో కంపెనీ షేరు విలువ 4 శాతం మేర పడిపోయింది.


## ఫోన్‌పే ఐపీఓ.. వాటాల అమ్మకానికి ముందుకు రాని షేర్‌హోల్డర్లు




ఒక కంపెనీకి పబ్లిక్ ఇష్యూకు వస్తుందంటే.. అందులో మొదట్లో పెట్టుబడి పెట్టిన వారు తమ వాటాలను విక్రయిస్తుంటారు. అందినకాడికి లాభాలను వెనకేసుకుంటారు. ఒకవేళ కంపెనీ వృద్ధికి ఇంకా అవకాశం ఉందని భావిస్తే కొద్ది మొత్తంలో షేర్లను అట్టిపెట్టుకోవడం చూస్తుంటాం. త్వరలో ఐపీఓకు రానున్న ఫోన్‌పే విషయంలో పరిస్థితి అందుకు భిన్నం! ఈ కంపెనీలో ప్రస్తుతం వాటాదారులెవరూ షేర్లను విక్రయించడానికి ముందుకు రాకపోవడం గమనార్హం. 2026లో అతిపెద్ద ఐపీఓగా ఫోన్‌పే రాబోతోంది. ఇప్పటికే సెబీ దీనికి ఆమోదం తెలిపింది. ఈ పబ్లిక్ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరగనుంది. అంటే కంపెనీ కొత్తగా ఎలాంటి షేర్లూ జారీ చేయడం లేదు. ఇప్పటికే ఉన్న షేర్‌హోల్డర్లు తమ వాటాలను విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా ఫోన్‌పేలో ప్రధాన వాటాదారు అయిన వాల్‌మార్ట్ (72 శాతం వాటా ఉంది) సుమారు 9% (45.9 మిలియన్ షేర్లు) అమ్ముతోంది. మైక్రోసాఫ్ట్ గ్లోబల్ ఫైనాన్స్ 36.78 లక్షల షేర్లు (0.7 శాతం), టైగర్ గ్లోబల్ 10.39 లక్షల షేర్లను (0.2 శాతం) చొప్పున వాటాలు విక్రయించనున్నాయి. ఇతర వాటాదారులు ఎవరూ తమ వాటాలను విక్రయించడానికి ముందుకు రాకపోవడం గమనార్హం. సెబీ నిబంధనల ప్రకారం.. లిస్టెడ్ కంపెనీలు కనీసం 10శాతం వాటా విక్రయించాల్సి ఉంటుంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వాల్‌మార్ట్ తన వాటాను తగ్గించుకుంటోంది. మరోవైపు ఫోన్‌పేలో జనరల్ అట్లాంటిక్ గతేడాది 600 మిలియన్ డాలర్ల పెట్టుబడితో తన వాటాను 8.9 శాతానికి మరింత పెంచుకుంది. ఈ లావాదేవీలో భాగంగా వ్యవస్థాపకులు, ఉద్యోగులు తమ స్టాక్ ఆప్షన్లను ఎక్సర్‌సైజ్ చేసి షేర్లుగా మార్చుకున్నారు. వారు టాక్స్ లయబిలిటీ కవర్ చేయడంలో భాగంగా 39% షేర్లను జనరల్ అట్లాంటిక్‌కు విక్రయించారు.

**ఎందుకు విక్రయించడం లేదు?....** ఫోన్‌పే వ్యవస్థాపకులు, ఉద్యోగులు, ఇన్వెస్టర్లు తమ వాటాలను విక్రయించడానికంటే అట్టిపెట్టుకోవడానికే మొగ్గు చూపుతున్నారు. ఇది ఫోన్‌పే దీర్ఘకాలిక వృద్ధికి సంకేతంగా అనలిస్టులు భావిస్తున్నారు. ఐపీఓల్లో ముందుగా ఎగ్జిట్ అవ్వడం, సెకండరీ సేల్ సాధారణమైన ఈ రోజుల్లో ఫోన్‌పే షేర్‌హోల్డర్లు మాత్రం భవిష్యత్‌పై మంచి సంపదను క్రియేట్ చేస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. అందుకే వాటాల విక్రయానికి రావడం లేదు. సుమారు రూ.13 వేల కోట్లను మార్కెట్ నుంచి సమీకరించేందుకు ఫోన్‌పే సన్నద్ధమవుతోంది.

## అదానీ గ్రూప్ స్టాక్స్ లో భారీగా అమ్మకాలు



ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ స్టాక్స్ నేడు (శుక్రవారం) భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (SEC) గౌతమ్ అదానీ, సాగర్ అదానీలకు సమన్లు జారీ చేసేందుకు కోర్టు అనుమతి కోరిన నేపథ్యంలో కంపెనీ షేర్లు 13 శాతం మేర పతనం అయ్యాయి. గ్రూప్‌నకు చెందిన 10 కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.1.4 లక్షల కోట్లు క్షీణించింది. అదానీ గ్రూప్‌లోని ఫ్లాగ్‌షిప్ కంపెనీ అయిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 9.38 శాతం పతనమై రూ.1,891.60కు చేరుకుంది. అదానీ పవర్ 8.84 శాతం పతనమై రూ.128.35, అదానీ పోర్ట్స్ 7.81 శాతం క్షీణించి రూ.1,303.35; అదానీ టోటల్ గ్యాస్ 7.55 శాతం నష్టంతో రూ.507 వద్ద ముగిశాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ షేరు 13.20 శాతం కుంగి రూ.785కి చేరుకుంది. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ 10.57 శాతం క్షీణతతో రూ.827.20 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో లోయర్ సర్క్యూట్‌ను తాకింది. గ్రూప్‌నకు చెందిన అంబుజా సిమెంట్స్ 5.98 శాతం; సంఘీ ఇండస్ట్రీస్ 5.96 శాతం; ఎన్డీటీవీ 5.31 శాతం; ఏసీసీ 2.76 శాతం చొప్పున నష్టపోయాయి.

--**ఏమిటీ కేసు?....** గౌతమ్ అదానీ, ఆయన సోదరుడి కుమారుడైన సాగర్ అదానీలకు 'మోసం, లంచం' కేసులో ఇసమన్లు ఇవ్వాలని అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ భావిస్తోంది. ఇందుకోసం అమెరికా కోర్టును ఆశ్రయించింది. గతంలో ఎస్ఈసీ నుంచి సమన్లు ఇవ్వడానికి వచ్చిన విజ్ఞప్తులను రెండుసార్లు మనదేశం తిరస్కరించింది. ఈ హైప్రొఫైల్ కేసులో సమన్లు ఇవ్వడానికి ఎస్ఈసీ గత ఏడాది నుంచీ ప్రయత్నిస్తోంది. అదానీ గ్రీన్‌ఎనర్జీ ఉత్పత్తి చేసిన విద్యుత్ కొనుగోలు కోసం భారత్‌లో ప్రభావం చూపే నాయకులు, అధికారులకు లంచాలు ఇచ్చారని.. ఇందుకోసం అమెరికన్ల వద్ద పెట్టుబడి రూపంలో సమీకరించిన నిధులు వినియోగించారన్నది ఆరోపణ. ఇవన్నీ అసత్య ఆరోపణలని, తాము అన్ని చట్టాలకు కట్టుబడి ఉన్నామని అదానీ గ్రూప్ పేర్కొంటోంది.

## విన్‌ఫాస్ట్.. మొన్న కార్లు.. ఇప్పుడు స్కూటర్



వియత్నామీస్ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ విన్‌ఫాస్ట్ ఇప్పటికే.. భారతదేశంలో ఎలక్ట్రిక్ కార్లను లాంచ్ చేసింది. ఇప్పుడు ఎలక్ట్రిక్ స్కూటర్ లాంచ్ చేయడానికి సిద్ధమైంది.

**విన్‌ఫాస్ట్ 2026 ద్వితీయార్థంలో..** ఎలక్ట్రిక్ టూ వీలర్ విభాగంలో అడుగుపెట్టనున్నట్లు సమాచారం. వీటిని కూడా కంపెనీ తమిళనాడులోని ప్లాంట్ నుంచి మార్కెట్‌కు సరఫరా చేయనుంది. మన దేశంలో ఎలక్ట్రిక్ టూ వీలర్ మార్కెట్ అంచెలంచెలుగా విస్తరిస్తున్న తరుణంలో.. ఆ విభాగంలో సంస్థ గట్టి పోటీ ఇవ్వడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగానే ఎలక్ట్రిక్ స్కూటర్ లాంచ్ చేయడానికి సంస్థ సంకల్పించింది.

**విన్‌ఫాస్ట్ ఎలక్ట్రిక్ కార్లు....** విన్‌ఫాస్ట్ VF6: విన్‌ఫాస్ట్ వీఎఫ్6 ఎలక్ట్రిక్ కారు.. ఒక కాంపాక్ట్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ. ఇది స్ప్లిట్ హెడ్‌లైట్, టెయిల్‌లైట్ సెటప్‌లు పొందుతుంది. లేటెస్ట్ డిజైన్ కలిగిన ఈ కారు.. కొత్త ఫీచర్స్ పొందుతుంది. మూడు ట్రిమ్ (ఎర్త్, విండ్, ఇన్ఫినిటీ) లెవెల్స్‌లో అందుబాటులో ఉన్న ఈ కారు 59.6 కిలోవాట్ బ్యాటరీ పొందుతుంది. ఎర్త్ వేరియంట్ 468 కిమీ రేంజ్ అందిస్తుంది. మిగిలిన రెండూ కూడా 463 కిమీ రేంజ్ అందిస్తాయి.

**విన్‌ఫాస్ట్ VF7.....:** టేపింగ్ రూఫ్‌లైన్, యాంగ్యులర్ రియర్ విండ్‌షీల్డ్‌తో స్ట్రీమ్‌లైన్డ్ ప్రొఫైల్ కలిగిన విన్‌ఫాస్ట్ వీఎఫ్7, ఎల్ఈడీ డేటైమ్ రన్నింగ్ లైట్స్ వంటివి పొందుతుంది. ఐదు వేరియంట్లలో లభించే ఈ కారు 59.6 కిలోవాట్, 70.8 కిలోవాట్ బ్యాటరీ ఎంపికలను పొందుతుంది. రేంజ్ అనేది వరుసగా 438 కిమీ, 532 కిమీ వరకు ఉంది.

## పెరిగిన థార్ ధరలు.. ఒకేసారి రూ. 20వేలు!



మహీంద్రా అండ్ మహీంద్రా భారతదేశంలో తన థార్ ధరలను సవరించింది. కంపెనీ అన్ని వేరియంట్ల ధరలను రూ. 20వేలు పెంచింది. ఈ కొత్త ధరలు వెంటనే అమల్లోకి వస్తాయి. మహీంద్రా థార్ బేస్ వేరియంట్ అయిన AX 2WD ధరలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. కాబట్టి దీని రేటు రూ. 9.99 లక్షల (ఎక్స్ షోరూమ్) వద్ద అలాగే కొనసాగుతుంది. 2WD & 4WD కాన్ఫిగరేషన్‌లలో మాన్యువల్, ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌లతో లభించే.. LX ట్రిమ్‌లతో సహా అన్ని ఇతర వెర్షన్‌లు ఇప్పుడు రూ. 20,000 పెరిగాయి. ధరల పెరుగుదల తరువాత.. మహీంద్రా థార్ టాప్ స్పెక్ వేరియంట్ ధర రూ. 17.19 లక్షలకు చేరింది. ఈ ఆఫ్ రోడర్ కారు పెట్రోల్, డీజిల్ ఇంజిన్ ఎంపికలతో.. మాన్యువల్, ఆటోమాటిక్ ట్రాన్స్‌మిషన్ ఎంపికలతో అందుబాటులో ఉంది. ఇది ఇండియన్ మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన లైఫ్ స్టైల్ ఆఫ్ రోడర్‌లలో ఒకటిగా నిలిచింది.

## భర్త అహంకారం.. భార్య ప్రతీకారం



ఓం శాంతి శాంతి శాంతిః' చిత్రంతో థియేటర్లలో వినోదాలు పంచనున్నారు తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా. ఈ ఇద్దరూ జంటగా నటించిన ఈ సినిమాని ఏఆర్ సజీవ్ తెరకెక్కించారు. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ సంస్థలు నిర్మించాయి. బ్రహ్మానందం, బ్రహ్మాజీ, సురభి ప్రభావతి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెల 30న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే హీరో విజయ్ దేవరకొండ శుక్రవారం ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. తనపై పెత్తనం చెలాయించే భర్తకి ఓ భార్య ఎలా బుద్ధి చెప్పింది.. అతడి అహంకారాన్ని ఎలా అణిచింది అనే నేపథ్యంలో సాగే కథ ఇది. దీన్ని గోదావరి జిల్లాల నేపథ్యం నుంచి చెప్పడం ఈ కథకు కొత్తదనాన్ని అద్దింది. ఓంకార్ నాయుడుగా తరుణ్ భాస్కర్ పాత్రని తీర్చిదిద్దిన తీరు.. ఈషాతో తన కెమిస్ట్రీ, వీళ్లిద్దరి మధ్య తలెత్తే సంఘర్షణ ఆసక్తిరేకెత్తించేలా ఉన్నాయి. “మన గోదారోళ్లకి ఎటకారాలు సూటయినట్టు.. ప్రతీకారాలు సూటవ్వవురా” అంటూ ట్రైలర్‌లో హీరోకి బ్రహ్మాజీ ఇచ్చే సలహా నవ్వులు పూయించింది.

## ప్రతి విరామానికి ఓ అర్థం

అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో ఎమోషనల్ డ్రామా నేపథ్యంతో రూపొందిన చిత్రం ‘లాక్‌డౌన్’. ఏఆర్ జీవా దర్శకత్వం వహించారు. గతేడాది విడుదల కావాల్సిన ఈ సినిమాని తమిళనాడులోని పలు ప్రాంతాల్లో సంభవించిన తుపానుతో పాటు పలు కారణాలతో విడుదలను వాయిదా వేసింది నిర్మాణసంస్థ. ఎట్టకేలకు ఈ సినిమా కొత్త విడుదల తేదీని ఖరారు చేసుకుంది. ఈ సినిమా ఈ నెల 30 థియేటర్లలో విడుదల కానుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ సామాజిక మాధ్యమాలలో ‘ప్రతి విరామానికి ఓ అర్థం ఉంటుంది’ అంటూ ఓ పోస్టర్‌తో అధికారికంగా ప్రకటించింది. నాయికా ప్రాధాన్యంగా తెరకెక్కిన ఈ చిత్రంలో అనుపమ అనిత అనే పాత్రలో కనిపించనుంది. కరోనా లాక్‌డౌన్ సమయంలో ఎదురైన సమస్యలతో సతమతమవుతున్న ఓ యువతిగా ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌తో వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని రూపొందించినట్లు స్పష్టంచేసింది చిత్రబృందం.





## రిలీజ్‌పై లేటెస్ట్ ట్వీట్.. నమ్మొచ్చు అంటారా?

మహేశ్ బాబురాజమౌళి కాంబోలో తీస్తున్న సినిమా 'వారణాసి'. రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో భారీ ఎత్తున ఈవెంట్ నిర్వహించి టైటిల్ అనౌన్స్ చేశారు. 2027లోనే రిలీజ్ ఉంటుందని అన్నట్లు చెప్పుకొచ్చారు. రాజమౌళి మూవీ అంటే చెప్పిన సమయానికి ఎప్పుడు రాదు. తెలుగు ప్రేక్షకులకు ఇది తెలుసు. దీంతో ఈ చిత్రం కూడా 2027లో రావడం సందేహమే అని చాలామంది అనుకుంటున్నారు. దీంతో టీమ్ మరోసారి క్లారిటీ ఇచ్చేసింది.

2027లోనే 'వారణాసి' రిలీజ్ అవుతుందని టీమ్ ఇప్పుడు ట్వీట్ చేసింది. తద్వారా మరోసారి క్లారిటీ ఇచ్చినట్లయింది. చాలామంది ఉగాది లేదా శ్రీరామనవమి కానుకగా ఈ చిత్రం థియేటర్లలోకి రావొచ్చని అనుకుంటున్నారు. ఈ రెండు పండగలు అంటే మరో ఏడాది మాత్రమే టైమ్ ఉంది. అప్పట్లో రాజమౌళి, సినిమాని సిద్ధం చేస్తారా అనేది చూడాలి? మహేశ్ అభిమానులు, చాలామంది నెటిజన్లు మాత్రం 2027లోనే రిలీజ్ అంటే అస్సలు నమ్మట్లేదు. ఈ మేరకు సోషల్ మీడియాలోనూ కామెంట్స్ పెడుతున్నారు.

మహేశ్ బాబు, ప్రియాంక చోప్రా హీరోహీరోయిన్లు కాగా.. 'వారణాసి'లో మలయాళ నటుడు పృథ్వీరాజ్ విలన్‌గా చేస్తున్నాడు. ఇందులో కాసేపు మహేశ్ రాముడి పాత్రలోనూ కనిపించబోతున్నాడు. ఈ విషయాన్ని స్వయంగా రాజమౌళినే బయటపెట్టాడు. టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ ఆధారంగా ఈ



## ‘స్పిరిట్’ సన్నాహాలు



ఈ సంక్రాంతి బరిలో ‘ది రాజాసాబ్’గా సందడి చేశారు కథానాయకుడు ప్రభాస్. ఇప్పుడాయన తిరిగి ‘స్పిరిట్’ కోసం రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. సందీప్ రెడ్డి దర్శకత్వంలో ముస్తాబవుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం ఇప్పటికే ఓ షెడ్యూల్‌ని పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్ర కొత్త షెడ్యూల్‌ను దేహ్రాదూన్‌లో ప్రారంభించేందుకు సందీప్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈనెలాఖరు నుంచి మొదలు కానున్న ఈ షెడ్యూల్‌లో ప్రభాస్‌తో పాటు ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు సమాచారం. ఇది దాదాపు రెండు వారాలు సాగనున్నట్లు తెలుస్తోంది. పవర్‌ఫుల్ పోలీసు కథతో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రంలో ప్రభాస్ ఐపీఎస్ అధికారిగా అలరించనున్నారు. తనిందులో భిన్న లుక్స్‌లో కనువిందు చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

## అపార్థం వల్ల ఎదురైన ఇబ్బందులేంటి?

అసభ్యతకు తావులేని మంచి కుటుంబ కథా చిత్రం ‘హలో ఇట్స్ మీ’. యువతీ యువకులు ఒకరినొకరు అపార్థం చేసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనేది ఈ సినిమాలో అందంగా చూపిస్తున్నాం” అన్నారు వరుణ్ సందేశ్. ఆయన హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని కథానాయిక షగ్నశ్రీ వేణున్ స్వయంగా తెరకెక్కిస్తోంది. దర్శన్ మదమంచి మరో హీరో. వీఎస్‌కే సంజీవ్, వి సందీప్, వి సంకీర్త్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో టైటిల్, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. “ప్రతి అమ్మాయి, అబ్బాయికి ఈ సినిమా రిలేట్ అవుతుంది. యూత్ అంతా దీనికి కనెక్ట్ అవుతారు” అన్నారు కథానాయిక, దర్శకురాలు షగ్న శ్రీ.



## ‘బోర్డర్ 2’.. దేశభక్తి నేపథ్యం మరోసారి మెప్పించిందా? రివ్యూ:

**బోర్డర్ 2; నటీనటులు: సన్నీ దేఓల్, వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహాన్ శెట్టి, మోనా సింగ్, సోనమ్ బజ్వా, అన్య సింగ్, అనురాగ్ అరోరా తదితరులు; సంగీతం: జాన్ స్టీవర్ట్, అను మాలిక్, మిథున్, సచేత్ - పరంపర, విశాల్ మిశ్రా, గుర్మోహ్; సినిమాటోగ్రఫీ: అన్షుల్; దర్శకత్వం: అనురాగ్ సింగ్; నిర్మాణ సంస్థలు: టీ సిరీస్ ఫిల్మ్స్, జేపీ ఫిల్మ్స్; విడుదల తేదీ: 23-01-2026**

బాలీవుడ్ నుంచి వచ్చిన గొప్ప దేశభక్తి చిత్రాల్లో ‘బోర్డర్’కి ప్రత్యేక స్థానముంది. 1971 ఇండో పాక్ యుద్ధం నేపథ్యంలో జేపీ దత్తా తెరకెక్కించిన ఈ సినిమా 1997లో విడుదలై బాక్సాఫీస్ ముందు సంచలన విజయాన్ని అందుకుంది. ఇప్పుడు 28ఏళ్ల తర్వాత ‘బోర్డర్ 2’ను తెరపైకి తీసుకొచ్చారు దర్శకుడు అనురాగ్ సింగ్. మరి ఈ చిత్ర కథేంటి? ప్రేక్షకుల్ని అలరించిందా?

**కథేంటంటే..**

border 2 story ‖ తొలి భాగంలాగే ‘బోర్డర్ 2’ కూడా 1971 నాటి భారత్ పాకిస్థాన్ యుద్ధ నేపథ్యంలోనే సాగుతుంది. ఇండియాను దెబ్బ కొట్టేందుకు పాక్ భూ, జల, వాయు మార్గాల ద్వారా కశ్మీర్, పంజాబ్, గుజరాత్ సరిహద్దుల వెంట భారీ దాడులకు యత్నిస్తుంది. దీన్ని ముందే పసిగట్టిన భారత ప్రభుత్వం త్రివిధ దళాల్ని యుద్ధానికి రంగంలోకి దించుతుంది. మరి ఈ పోరులో లెఫ్టినెంట్ కల్నల్ ఫతేహ్ సింగ్ ఖేల్కర్ (సన్నీ దేఓల్), మేజర్ హోషియార్ సింగ్ దహియా (వరుణ్ ధావన్), లెఫ్టినెంట్ కమాండర్ ఎంఎస్ రావత్ (అహాన్ శెట్టి), ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ నిర్మల్ జిత్ సింగ్ సెఖోన్ (దిల్జీత్ దోసాంజ్) ఎలాంటి ధైర్య సాహసాలు ప్రదర్శించారు? పాక్ సైన్యాన్ని ఎలా మట్టికరిపించారు? ఈ క్రమంలో ఎదుర్కొన్న సవాళ్లేంటి? అన్నది మిగిలిన కథ.

**ఎలా సాగిందంటే..**

ఈ సినిమా 1971 యుద్ధం తర్వాత జరిగిన మరో కీలకమైన సరిహద్దు పోరాటం చుట్టూ తిరుగుతుంది. మొదటి భాగంలో కేవలం ఆర్మీ పోరాటాన్ని మాత్రమే చూపిస్తే.. ఈసారి ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ సంయుక్తంగా చేసిన త్రిముఖ పోరును కళ్లకు కట్టినట్లు ఉద్వేగభరితంగా చూపించారు. ‘బోర్డర్’ జ్ఞాపకాల్ని గుర్తు చేస్తూ.. పాక్ ముష్కరుల్ని చీల్చి చెండాడే ఓ వీరోచిత పోరాట ఘట్టంతో సన్నీ దేఓల్ పాత్రను పరిచయం చేసిన తీరు చక్కటి విజిల్ మూమెంట్‌లా ఉంటుంది. ఆ తర్వాత నుంచి కథ ఫ్రెండ్‌షిప్, కుటుంబ భావోద్వేగాల మేళవింపుగా సాగుతుంది. కొత్తతరం సైనికులుగా వరుణ్, దిల్జీత్, అహాన్‌లు పరిచయమైన తీరు.. సైనిక శిక్షణలో వాళ్ల మధ్య సాగే సరదా గొడవలు.. మిత్రులుగా మారాక ముగ్గురూ కలిసి చేసిన అల్లరి.. అన్నీ హత్తుకునేలా ఉంటాయి. కాకపోతే ఈ ముగ్గురి కుటుంబ నేపథ్యాల్ని పరిచయం చేయడానికి దర్శకుడు కాస్త ఎక్కువ సమయమే తీసుకున్నాడనిపించింది. ఎప్పుడైతే సరిహద్దు వెంట పాక్ యుద్ధ సన్నాహాలు ప్రారంభిస్తుందో అక్కడి నుంచే కథలో సంఘర్షణ మొదలవుతుంది. ఈ యుద్ధం కోసం కథానాయకులంతా రంగంలోకి దిగడం.. ఈ క్రమంలో ఓ చక్కటి ట్విస్ట్‌తో ప్రథమార్ధానికి విరామమిచ్చిన తీరు ద్వితీయార్ధంపై అంచనాలు పెంచేలా చేస్తుంది.

ఇక ద్వితీయార్ధం ఆద్యంతం హైఓల్టేజ్ వార్ సీక్వెన్స్‌లతోనే ఉత్కంఠభరితంగా సాగుతుంది. ఓవైపు నేవీ లెఫ్టినెంట్ కమాండర్‌గా అహాన్ శెట్టి నడి సంద్రంలో పాక్ సబ్‌మెరైన్‌తో సాగించే వీరోచిత పోరాటం.. మరోవైపు గగనతలంలో దాయాది దేశ జెట్ ఫైటర్లను ఫ్లైయింగ్ ఆఫీసర్ దిల్జీత్ వెంటాడి వేటాడే తీరు.. ఆద్యంతం రోమాంచితమే. అంతేకాదు ఆ పాత్రల ప్రాణత్యాగం మనసుల్ని మెలిపెడుతుంది. ‘బోర్డర్’ జ్ఞాపకాల్ని మరోసారి గుర్తు చేస్తూ వచ్చే ‘సందేసే ఆతే హై’ పాట ప్రతిఒక్కరి మదిని కదిలిస్తుంది. ఇక భారత నేవీ, ఎయిర్‌ఫోర్స్.. శత్రుదేశ సైనికులతో చేసిన పోరాటం ఒకెత్తైతే.. ఆర్మీ సాగించిన అలుపెరుగని సుదీర్ఘ పోరాటం మరో ఎత్తు. పాక్ సైన్యం కురిపించే తూటాల వర్షాన్ని దాటుకుంటూ ఆ దేశ సరిహద్దుల్లోకి వెళ్లి వరుణ్ చేసే విధ్వంసం.. మరో చోట పాక్ రహస్య స్థావరంలోకి చొచ్చుకెళ్లి సన్నీ దేఓల్ చేసే వీరోచిత విన్యాసాలు ప్రీక్లైమాక్స్‌కు హైలైట్. ముఖ్యంగా పాక్ యుద్ధ ట్యాంకుల్ని వన్ మ్యాన్ ఆర్మీలా సన్నీ గ్రనేడ్లతో పేల్చేసే తీరు థ్రిల్లింగ్‌గా ఉంటుంది. ఇక పతాక ఘట్టాల్లో ఆయన.. వరుణ్ కలిసి పాక్ సైన్యంపై సాగించిన పోరాటం ఆకర్షణగా ఉంటుంది.

**ఎవరెలా చేశారంటే..**

లెఫ్టినెంట్ కల్నల్ ఫతేహ్ సింగ్ పాత్రలో సన్నీ దేఓల్ స్క్రీన్ ప్రజెన్స్, తను చూపిన గంభీరత్వం, చేసిన పోరాట ఘట్టాలు అన్నీ సినిమాకి ప్రధాన ఆకర్షణ. వరుణ్ ధావన్, అహాన్ శెట్టి, దిల్జీత్ పాత్రలు ఆరంభంలో ఎంత సరదాగా కనిపిస్తాయో.. ద్వితీయార్ధంలో అంతగా భావోద్వేగాలతో మనసుల్ని బరువెక్కిస్తాయి. యాక్షన్ ఘట్టాల్లో ముగ్గురు పోటాపోటీగా మెప్పించారు. మోనా సింగ్, సోనమ్ బాజ్వా, అన్య సింగ్, అనురాగ్ అరోరా తదితరుల పాత్రలు పరిధి మేరకు ఉంటాయి. ‘బోర్డర్’తో పోల్చితే ఈ రెండో భాగంలో కొన్ని చోట్ల భావోద్వేగాలు కొరవడినట్లు కనిపించినా.. ప్రేక్షకుల అంచనాల్ని అందుకునేలా దీన్ని రూపొందించడంలో దర్శకుడు అనురాగ్ విజయం సాధించారు. కాకపోతే నిడివిని తగ్గించి ఉంటే కథలో కాస్త వేగం కనిపించేది.

**బలాలు**
**+ సన్నీ దేఓల్, వరుణ్ ధావన్ నటన**
**+ దేశభక్తి అంశాలు**
**+ ద్వితీయార్ధంలోని పోరాట ఘట్టాలు**
**బలహీనతలు:**
**- నిడివి**
**- ప్రథమార్ధంలోని సాగదీత**
**చివరిగా: దేశభక్తిని రగిలించడమే కాదు.. థ్రిల్ పంచే ‘బోర్డర్ 2’**
**గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!**



# సర్ఫరాజ్ డబుల్ సెంచరీ



ముంబయి బ్యాటర్ సర్ఫరాజ్‌ఖాన్ (227; 219 బంతుల్లో 19×4, 9×6) అదరగొట్టాడు. బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడిన సర్ఫరాజ్ డబుల్ సెంచరీతో సత్తాచాటాడు. దీంతో ఉప్పల్ స్టేడియంలో హైదరాబాద్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూపుడి మ్యాచ్‌లో ముంబయి భారీ స్కోరు సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 332/4తో శుక్రవారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబయి 123.2 ఓవర్లలో 560 పరుగులకు ఆలౌటైంది. సర్ఫరాజ్, సువేద్ పార్కర్ (75; 98 బంతుల్లో 11×4, 1×6) ఆరో వికెట్‌కు 154 పరుగులు జోడించారు. హైదరాబాద్ బౌలర్ రక్షణ్‌రెడ్డి (4/107) మెరిశాడు. అనంతరం రెండో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 41 ఓవర్లలో 2 వికెట్లకు 138 పరుగులు రాబట్టింది. 38 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన హైదరాబాద్‌ను రాహుల్‌సింగ్ (82 బ్యాటింగ్; 129 బంతుల్లో 11×4, 1×6), కొడిమెల హిమతేజ (40 బ్యాటింగ్; 84 బంతుల్లో 6×4) ఆదుకున్నారు.

**ఆంధ్రపై విదర్భకు ఆధిక్యం....** అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూపుఎ మ్యాచ్‌లో విదర్భ పైచేయి సాధించింది. ఆతిథ్య జట్టుపై 67 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోరు 267/7తో రెండో రోజు ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 89.3 ఓవర్లలో 295 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లు కలిదిండి రాజు (5/62), కావూరి సాయితేజ (3/46) రాణించారు. అనంతరం ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 65.3 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌటైంది. అభిషేక్‌రెడ్డి (73; 91 బంతుల్లో 12×4), సౌరభ్‌కుమార్ (62; 87 బంతుల్లో 8×4), నితీశ్‌కుమార్‌రెడ్డి (35; 48 బంతుల్లో 4×4) పోరాడినా.. ప్రత్యర్థి ఆధిక్యాన్ని అడ్డుకోలేకపోయారు. శుక్రవారం ఆట ముగిసే సమయానికి విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 4 పరుగులు సాధించింది.

# భారత్ ఘన విజయం

**సూర్య, ఇషాన్ మెరుపులు**
**భారత్‌దే రెండో టీ20**
**సూర్యకుమార్ 82 నాటౌట్**

న్యూజిలాండ్‌తో రెండో టీ20.. భారత్ లక్ష్యం 209.. రెండు ఓవర్లకు స్కోరు 2/6. సంజు శాంసన్ తొలి ఓవర్లోనే ఔట్ కాగా.. గత మ్యాచ్‌లో మెరిసిన అభిషేక్ శర్మ డకౌట్ అయ్యాడు. ఈ స్థితిలో ఉన్న జట్టు 16వ ఓవర్లోనే లక్ష్యాన్ని అందుకుంటుందని ఎవరైనా అనుకుంటారా? కానీ రాయ్‌పుర్‌లో టీమ్‌ఇండియా ఆ అద్భుతమే చేసింది. కెప్టెన్ సూర్యకుమార్, ఇషాన్ కిషన్, శివమ్ దూబె సిక్సర పిడుగుల్లా చెలరేగడంతో భారీ లక్ష్యాన్ని ఊదేసింది. అయిదు టీ20ల సిరీస్‌లో 20తో ఆధిక్యంలో నిలిచింది. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో భారత్ చెలరేగిపోతోంది. బ్యాట్‌తో మెరిసిన సూర్యసేన రెండో టీ20లో 7 వికెట్ల తేడాతో కివీస్‌ను చిత్తు చేసింది. శుక్రవారం మొదట కివీస్ 6 వికెట్లకు 208 పరుగుల భారీ స్కోరు చేసింది. శాంట్నర్ (47 నాటౌట్; 27 బంతుల్లో 6×4, 1×6), రచిన్ రవీంద్ర (44; 26 బంతుల్లో 2×4, 4×6) సత్తా చాటారు. కుల్‌దీప్ 2 వికెట్లు తీశాడు. సూర్యకుమార్ (82 నాటౌట్; 37 బంతుల్లో 9×4, 4×6), ఇషాన్ కిషన్ (76; 32 బంతుల్లో 11×4, 4×6), శివమ్ దూబె (36 నాటౌట్; 18 బంతుల్లో 1×4, 3×6) చెలరేగడంతో భారత్ 15.2 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. మూడో టీ20 ఆదివారం జరగనుంది.

**ఇషాన్ మొదలెడితే.. సూర్య అందుకున్నాడు....:** రెండేళ్ల విరామం తర్వాత భారత జట్టులోకి వచ్చి, తొలి టీ20లో విఫలమైన ఇషాన్ కిషన్.. రెండో టీ20లో అదరగొట్టాడు. భారీ ఛేదనలో భారత్ ఆరంభంలోనే సంజు శాంసన్ (6), అభిషేక్ శర్మ (0) వికెట్లు కోల్పోయినా.. ఇషాన్ తగ్గలేదు. ఫౌక్స్ వేసిన మూడో ఓవర్లో అతడు చెలరేగిపోయాడు. ఇషాన్ 3 ఫోర్లు, ఓ సిక్స్ కొట్టడంతో ఆ ఓవర్లో 24 పరుగులు వచ్చాయి. శాంట్నర్ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు కొట్టిన ఇషాన్.. 21 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. అర్ధసెంచరీ తర్వాతా అతడి బాదుడు కొనసాగింది. మరోవైపు గత మ్యాచ్‌లో ఓ మోస్తరు ఇన్నింగ్స్‌తో ఫామ్ అందుకున్న సూర్యకుమార్ కూడా మెరుపులు మెరిపించాడు. ఫౌక్స్ వేసిన తొమ్మిదో ఓవర్లో అతడు 4 ఫోర్లు, ఓ సిక్స్ బాదడంతో ఏకంగా 25 పరుగులు వచ్చాయి. ఈ స్థితిలో ఇషాన్‌ను సోధి ఔట్ చేసి కివీస్‌కు బ్రేక్ ఇచ్చాడు. అయినా ఆ జట్టుకు ఉపశమనం లేకుండా పోయింది. సూర్యతో పాటు శివమ్ దూబె సైతం భారీ షాట్లకు దిగడంతో భారత్ 13 ఓవర్లకు 178/3తో లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. సూర్యదూబె మెరుపులతో సమీకరణం (42 బంతుల్లో 31) అందుబాటులోకి వచ్చింది. భారత్ 28 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకుంది. న్యూజిలాండ్ ఫీల్డర్ల వైఫల్యం కూడా టీమ్‌ఇండియాకు కలిసొచ్చింది.

**శాంట్నర్, రచిన్ మెరుపులు....:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్.. ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగింది. అర్ష్‌దీప్‌ను లక్ష్యంగా చేసుకున్న కివీస్ ఓపెనర్లు అతడు వేసిన తొలి రెండు ఓవర్లలో 18 పరుగుల చొప్పున ఏకంగా 36 పరుగులు రాబట్టారు. 3 ఓవర్లకు కివీస్ 43/0తో నిలిచింది. ఈ స్థితిలో నాలుగో ఓవర్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసిన హర్షిత్ రాణా.. డెవాన్ కాన్వే (19; 9 బంతుల్లో 3×4, 1×6)ను ఓ స్లో బంతితో పెవిలియన్ చేర్చాడు. ఈ ఓవర్ మెయిడెన్ కూడా కావడం విశేషం. తర్వాతి ఓవర్లోనే మరో ఓపెనర్ టిమ్ సీఫర్ట్ (24; 13 బంతుల్లో 5×4)ను వరుణ్ బుట్టలో వేయడంతో కివీస్‌కు మరోఎదురుదెబ్బ తగిలింది. వికెట్లు పడినా రచిన్ రవీంద్ర దూకుడుగా ఆడాడు. హర్షిత్ వేసిన ఆరో ఓవర్లో అతడు రెండు సిక్స్‌లు, ఓ ఫోర్ కొట్టాడు. ఆ తర్వాతా రచిన్ జోరు కొనసాగింది. దీంతో 8 ఓవర్లకు 84/2తో కివీస్ బలమైన స్థితిలో నిలిచింది. కుల్‌దీప్ ఓవర్లో సిక్స్, రెండు ఫోర్లు కొట్టి జోరు మీద కనిపించిన ఫిలిప్స్ (19; 13 బంతుల్లో 2×4, 1×6).. అదే ఓవర్లో ఔటయ్యాడు. మిచెల్ (18; 11 బంతుల్లో 3×4), రచిన్ ఓవర్ తేడాతో పెవిలియన్ చేరడంతో 13 ఓవర్లకు కివీస్ 132/5తో నిలిచింది. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పరుగుల వేగం తగ్గింది. ఆ జట్టు 17 ఓవర్లకు 161/6తో నిలిచింది. ఈ స్థితిలో 18వ ఓవర్లో శాంట్నర్ సిక్స్, రెండు ఫోర్లు బాది స్కోరు పెంచాడు. అతడితో పాటు ఫౌక్స్ (15 నాటౌట్; 8 బంతుల్లో 2×4, 1×6) దూకుడుగా ఆడడంతో కివీస్ భారీ స్కోరు చేసింది. ఆఖరి ఓవర్ చివరి రెండు బంతులను ఫౌక్స్ 6, 4 బాది స్కోరును 200 దాటించాడు. అర్ష్‌దీప్ (0/53) భారీగా పరుగులు ఇచ్చుకున్నాడు. భారత్ ఈ మ్యాచ్‌లో బుమ్రాకు విశ్రాంతినిచ్చి హర్షిత్ రాణాను ఆడించింది. గాయపడ్డ అక్షర్ స్థానంలో కుల్‌దీప్ జట్టులోకి వచ్చాడు.






**వేగవంతమైన ఛేదన ....** 209 పరుగుల లక్ష్యాన్ని భారత్ 15.2 ఓవర్లలోనే అందుకుంది. టీ20 చరిత్రలో 200 పైచిలుకు లక్ష్యాల్లో ఇదే వేగవంతమైన ఛేదన. గత ఏడాది న్యూజిలాండ్‌పై పాకిస్థాన్ 205 పరుగులను 16 ఓవర్లలో ఛేదించిన రికార్డు బద్దలైంది.

**ఫౌక్స్.. కోరుకోని రికార్డు ....** న్యూజిలాండ్ పేసర్ జాక్ ఫౌక్స్ పేలవ రికార్డు మూటగట్టుకున్నాడు. అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లో 3 ఓవర్లలో అత్యధిక ఎకానమీ నమోదు చేసిన బౌలర్‌గా నిలిచాడు. సెర్బియా స్పిన్నర్ డిజిజా (బల్గేరియాపై 3 ఓవర్లలో 63 పరుగులు, 21 ఎకానమీ) పేరిట ఉన్న రికార్డును ఫౌక్స్ బద్దలు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో అతడు 3 ఓవర్లలో ఏకంగా 67 పరుగులు (22.3 ఎకానమీ) సమర్పించుకున్నాడు. వరుసగా మూడు ఓవర్లలో అతను 24, 25, 18 పరుగులు ఇచ్చుకున్నాడు.

**న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) హార్దిక్ (బి) హర్షిత్ 19; సీఫర్ట్ (సి) కిషన్ (బి) వరుణ్ 24; రచిన్ (సి) అర్ష్‌దీప్ (బి) కుల్‌దీప్ 44; ఫిలిప్స్ (సి) హార్దిక్ (బి) కుల్‌దీప్ 19; మిచెల్ (సి) హార్దిక్ (బి) దూబె 18; చాప్‌మన్ (సి) అభిషేక్ (బి) హార్దిక్ 10; శాంట్నర్ నాటౌట్ 47; ఫౌక్స్ నాటౌట్ 15; ఎక్స్‌ట్రాలు 12 మొత్తం: (20 ఓవర్లలో 6 వికెట్లకు) 208; వికెట్ల పతనం: 143, 243, 398, 4125, 5129, 6161; బౌలింగ్: అర్ష్‌దీప్ 40530; హార్దిక్ 30251; హర్షిత్ 31351; వరుణ్ 40351; కుల్‌దీప్ 40352; అభిషేక్ 10120; దూబె 1071**

**భారత్ ఇన్నింగ్స్: శాంసన్ (సి) రచిన్ (బి) హెన్రీ 6; అభిషేక్ (సి) కాన్వే (బి డఫీ 0; కిషన్ (సి) హెన్రీ (బి) సోధి 76; సూర్య 82 నాటౌట్; శివమ్ దూబె నాటౌట్ 36; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం: (15.2 ఓవర్లలో 3 వికెట్లకు) 209; వికెట్ల పతనం: 16, 26, 3128; బౌలింగ్: హెన్రీ 30411; డఫీ 40381; ఫౌక్స్ 30670; శాంట్నర్ 20270; ఇష్ సోధి 30341; మిచెల్ 0.2020**

# ప్రిక్వార్టర్స్‌లో అల్కరాస్



ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అగ్రశ్రేణి ఆటగాడు కార్లోస్ అల్కరాస్ జోరు కొనసాగుతోంది. అతను అలవోకగా ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. జ్వెరెవ్, మెద్వెదెవ్ సైతం ముందంజ వేశారు. మహిళల్లో సబలెంకా ప్రిక్వార్టర్స్ చేరడానికి చెమటోడ్చగా.. కొకో గాఫ్ సైతం మూడో రౌండ్ దాటింది. కెరీర్ గ్రాండ్‌స్లామ్‌పై గురిపెట్టిన స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాస్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్లో ఈ టాప్ సీడ్ ఆటగాడు 62, 64, 61తో కొరెంటిన్ మౌటెట్ (ఫ్రాన్స్)ను ఓడించాడు. ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచే అల్కరాస్ జోరు సాగింది. రెండో గేమ్‌లోనే మౌటెట్ సర్వీస్ బ్రేక్ అయింది. 51తో ఆధిక్యంలో నిలిచిన అల్కరాస్ తేలిగ్గా తొలి సెట్ గెలిచాడు. రెండో సెట్ ఆట కూడా ఆరంభంలో మొదటి సెట్‌నే తలపించినా.. తర్వాత మౌటెట్ పుంజుకున్నాడు. తెలివైన నెట్ గేమ్‌తో అదరగొట్టిన ఈ ఫ్రాన్స్ కుర్రాడు.. 13తో వెనుకబడ్డ దశ నుంచి 33తో స్కోరు సమం చేశాడు. కానీ తొమ్మిదో గేమ్‌లో బ్రేక్ సాధించిన అల్కరాస్.. ఆపై సెట్ నెగ్గి ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకున్నాడు. మూడో సెట్లో అల్కరాస్ జోరు ముందు మౌటెట్ ఏమాత్రం నిలవలేకపోయాడు. 40తో నిలిచిన అల్కరాస్.. అదే ఊపులో సెట్‌తో పాటు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. మ్యాచ్‌లో అల్కరాస్ 3 ఏస్‌లు, 30 విన్నర్లు కొట్టాడు. మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), ఆరో సీడ్ డిమినార్ (ఆస్ట్రేలియా), పదకొండో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) కూడా ప్రిక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. మూడో రౌండ్లో జ్వెరెవ్ 75, 46, 63, 61తో నోరి (బ్రిటన్)పై, మెద్వెదెవ్ 67 (57), 46, 75, 60, 63తో మెరోజ్‌సన్ (హంగేరి)పై గెలిచారు. డిమినార్ 63, 64, 75తో తియాఫో (అమెరికా) పోరాటానికి తెరదించాడు. బబ్లిక్ (కజకిస్థాన్) 76 (74), 76 (75), 64తో ఎచెవరీ (అర్జెంటీనా)పై, తియాన్ (అమెరికా) 76 (119), 64, 62తో బోర్జెస్ (పోర్చుగీస్)పై గెలిచి ప్రిక్వార్టర్స్‌లోకి అడుగుపెట్టారు. 13వ సీడ్ రుబ్లెవ్ (రష్యా) 36, 67 (47), 36తో సెరుండోలో (అర్జెంటీనా) చేతిలో కంగుతిన్నాడు. టామీ పాల్ (అమెరికా) 61, 61తో ఆధిక్యంలో ఉన్న సమయంలో ప్రత్యర్థి దేవిడోవిచ్ (స్పెయిన్) గాయంతో తప్పుకొన్నాడు.

**సబలెంకా కాస్త కష్టంగా..:** మహిళల సింగిల్స్‌లో టైటిల్ ఫేవరెట్ అర్యానా సబలెంకా (బెలారస్) ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. ఈ టాప్ సీడ్ క్రీడాకారిణి కాస్త కష్టంగా మూడో రౌండ్‌ను అధిగమించింది. సబలెంకా 76 (74), 76 (97)తో పొటపోవా (ఆస్ట్రియా)ను ఓడించింది. రెండు సెట్లు టైబ్రేకర్‌లోనే ఫలితం తేలిన ఈ మ్యాచ్.. రెండు గంటలకు పైగా సాగింది. తొలి సెట్లో ఆరంభంలో సబలెంకానే ఆధిపత్యం ప్రదర్శించింది. 20తో ఆధిక్యంలో నిలిచింది. కానీ పొటపోవా వెంటనే పుంజుకుంది. మూడో గేమ్‌లో సబలెంకా సర్వీస్ బ్రేక్ చేసి.. ఆపై 22తో స్కోరు సమం చేసింది. ఇద్దరూ తగ్గకపోవడంతో సెట్ టైబ్రేకర్‌కు మళ్లింది. టైబ్రేకర్‌లో 30తో ఆధిక్యంలో నిలిచిన సబలెంకా.. అదే జోరుతో సెట్ గెలిచింది. రెండో సెట్లో సబలెంకా దూకుడుగా ఆడింది. 40తో నిలిచిన ఆమె.. తేలిగ్గా సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలిచేలా కనిపించింది. అయితే పొటపోవా మళ్లీ పుంజుకుంది. 6, 8 గేమ్‌లలో బ్రేక్‌లు సాధించి 44తో స్కోరు సమం చేసింది. ఇద్దరూ జోరు కొనసాగించడంతో టైబ్రేకర్ తప్పలేదు. టైబ్రేకర్‌లోనూ ఆట హోరాహోరీగా సాగింది. స్కోరు 77తో సమంగా ఉన్నప్పుడు రెండు వరస పాయింట్లు సాధించిన సబలెంకా.. మ్యాచ్‌ను గెలుచుకుంది. సబలెంకా 3 ఏస్‌లతో పాటు 34 విన్నర్లు కొట్టింది. నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసింది.

**గాఫ్ ముందుకు:** మూడో సీడ్ కొకో గాఫ్ (అమెరికా), ఎనిమిదో సీడ్ ఆండ్రీవా (రష్యా), పన్నెండో సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) ముందంజ వేశారు. గాఫ్ 36, 60, 63తో బాప్టిస్టీ (అమెరికా)పై, ఆండ్రీవా 63, 64తో రూజ్ (రొమేనియా)పై గెలవగా.. స్వితోలినా 76 (74), 63తో ష్నైడర్ (రష్యా)ను ఓడించింది. ఏడో సీడ్ పావోలిని (ఇటలీ), 14వ సీడ్ టౌసన్ (డెన్మార్క్) ఇంటిముఖం పట్టారు. పావోలిని 26, 67 (37)తో జొవిచ్ (అమెరికా) చేతిలో ఓడగా.. టౌసన్ 67 (57), 75, 36తో ఎంబాకో (కెనడా)కు తలొంచింది. పుటింట్సెవా (కజకిస్థాన్) 63, 67 (37), 63తో సొన్మెజ్ (తుర్కియే)ను ఓడించగా.. ముచోవా 61, 61తో లినెట్ (పోలెండ్)ను చిత్తు చేసింది.

# బంగ్లాకు ఐసీసీ మరో షాక్

దిల్లీ: టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌ల వేదిక మార్పు విషయంలో ఐసీసీతో తలపడిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీసీబీ విజ్ఞప్తిని ఇప్పటికే తిరస్కరించిన ఐసీసీ ఆ దేశానికి మరోసారి షాకిచ్చింది. భారత్‌లోనే తమ మ్యాచ్‌లను నిర్వహించాలన్న ఐసీసీ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీసీబీ దాఖలు చేసిన అప్పీల్‌ను ఐసీసీ వివాద పరిష్కార కమిటీ (డీఆర్‌సీ) తోసిపుచ్చింది. తమ పరిధిలోకి రాని అంశంపై విచారణ జరపలేమని డీఆర్‌సీ కమిటీ స్పష్టం చేసింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి నియమావళి, డీఆర్‌సీ నిబంధనల ప్రకారం ఐసీసీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ తీసుకున్న నిర్ణయాలపై అప్పీల్‌ను విచారించే అధికారం కమిటీకి లేదు. అంతకుముందు జరిగిన ఓటింగ్‌లో ఐసీసీ బోర్డు సభ్యులు 142 మెజారిటీతో భారత్‌లోనే బంగ్లా మ్యాచ్‌లు నిర్వహించాలని తీర్మానించారు. డీఆర్‌సీ నిర్ణయం నేపథ్యంలో చివరి అస్త్రంగా స్విట్జర్లాండ్‌లోని కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్)ను ఆశ్రయించాలని బీసీబీ భావిస్తోంది. బీసీబీ తీరు మారకపోవడం, టోర్నీకి సమయం దగ్గరపడడంతో బంగ్లా జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ఆడించాలని ఐసీసీ దాదాపుగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు

International Cricket Council

# సింధు, లక్ష్యసేన్ పరాజయం



జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది. స్టార్ షట్లర్లు పి.వి.సింధు, లక్ష్యసేన్‌లకు క్వార్టర్‌ఫైనల్లో చుక్కెదురైంది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ పోరులో సింధు 1321, 1721తో చెన్ యుఫెయ్ (చైనా) చేతిలో పరాజయం పాలైంది. 42 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో సింధుపై పైచేయి సాధించిన చెన్.. భారత క్రీడాకారిణిపై తన గెలుపోటముల రికార్డును 86తో మరింత మెరుగుపరుచుకుంది. చివరిసారి 2019లో చెన్‌పై సింధు గెలిచింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 1821, 2022తో పనిచాఫాన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడాడు. 21 ఏళ్ల పనిచాఫాన్ ప్రిక్వార్టర్స్‌లో పారిస్ ఒలింపిక్ కాంస్య పతక విజేత లీ జియా (మలేసియా)ను చిత్తుచేశాడు.

# ఆ భయం వల్లే టైటిల్ రాలేదేమో



2011 తర్వాత 2024 వరకు భారత జట్టు ప్రపంచకప్ గెలవకపోవడానికి ఆటగాళ్లలో నెలకొన్న వైఫల్య భయం ప్రధాన కారణం కావొచ్చని మాజీ కెప్టెన్ రోహిత్‌శర్మ అన్నాడు. మహేంద్రసింగ్ ధోని సారథ్యంలో 2011లో వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత్.. ఆ తర్వాత సాధించిన టైటిల్ 2024లో రోహిత్ సారథ్యంలో సాధించిన టీ20 ప్రపంచకప్పే. ''కెరటం ఎప్పుడూ కిందకే ఉండదు. ఏదో ఒక సమయంలో పైకి లేస్తుంది. కానీ అందుకు 13 ఏళ్లు పడుతుందని అస్సలు ఊహించలేదు. 2011లో కప్ గెలిచాం. 2024లో మళ్లీ నెగ్గాం. మొత్తం 13 ఏళ్లు పట్టింది. 2013లో ఛాంపియన్స్ ట్రోఫీ సాధించాం. సాంకేతికంగా ఐసీసీ ట్రోఫీ గెలవడానికి 11 ఏళ్లు పట్టినట్లు. అయినా 11 ఏళ్లు చాలా సుదీర్ఘ సమయమే. మేమెప్పుడు సరైన దిశలోనే ప్రయాణిస్తున్నామని నమ్మాం. కానీ దురదృష్టవశాత్తు ఏదో లోపించింది. బహుశా మా అందరిలోకి వైఫల్యం గురించిన భయం చొరబడిందేమో అనిపించింది. అది నిజం కావొచ్చు.. కాకపోవచ్చు. కానీ అదే నా భావన'' అని రోహిత్ వివరించాడు.